RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :3 సంచిక:198 బుధవారం 19 ఆగస్టు 2026 పేజీలు :8 వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.

PRESS

77309 83966 98491 98098



# పాపన్న స్ఫూర్తితో బహుజనుల తెలంగాణ

- సామాజిక న్యాయమే ఇందిరమ్మ పాలన లక్ష్యం సీఎం రేవంత్‌రెడ్డి
- పాపన్న విగ్రహానికి తెలంగాణ అమరవీరుల స్థూపం స్థాయిలో ప్రాధాన్యం
- గీత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు
- కులవృత్తిని గౌరవించండి.. పిల్లలను చదివించండి
- కేసీఆర్‌ది కుటుంబ న్యాయం.. మాది సామాజిక న్యాయం: రేవంత్‌రెడ్డి

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 18 :

హైదరాబాద్, ఆగస్టు18 : ఇది బహుజనుల తెలంగాణ.. సామాజిక న్యాయం, జీవించడానికి స్వేచ్ఛ ఇందిరమ్మ పాలనలో ఉందని నిరూపించాం అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సచివాలయం ఎదుట సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆయన స్ఫూర్తిని పంచాలని చాలాకాలంగా గౌడ సోదరులు అడుగుతున్నారని, ట్యాంక్ బండ్‌పై ఉన్న పర్యాటక కార్యాలయాన్ని కూల్చివేసి పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలని సూచించానని చెప్పారు. పర్యాటకులు, సందర్శకులు ట్యాంక్ బండ్‌పైకి వచ్చినప్పుడు పాపన్న గౌడ్ దర్శనం జరిగి ఆయన స్ఫూర్తి వారిలో నిండాలని కోరుకున్నానన్నారు. బహుజనుల నుంచి పుట్టుకొచ్చిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. ఆయన తన కులం, కుటుంబం కోసమే పనిచేయక బహుజనులతో కలిసి దండయాత్ర చేసి గోల్కొండ కోటపై జెండాను ఎగురవేశారని తెలిపారు. ఆయన స్ఫూర్తి ఎప్పటికీ తెలంగాణ ప్రజలకు ఉండాలన్నారు. మహారాష్ట్రలో శివాజీ విగ్రహానికి ఎలాంటి ప్రాధాన్యత ఇస్తారో తెలంగాణలో బహుజనులు కూడా పాపన్న గౌడ్ విగ్రహానికి అంతే ప్రాధాన్యత ఇస్తారన్నారు. బ్రిటిష్ లైబ్రరీలో పాపన్న గౌడ్ విశేషాలు ఉన్నాయని, అక్కడినుంచే మనం ఆయన చరిత్రను తెలుసుకున్నామని చెప్పారు. బహుజనుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు

మిగతా 2వ పేజీలో..



## యాజమాన్యాల బెదిరింపులకు తలొగ్గేది లేదు..

- ప్రైవేటు భాగస్వామ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోం
- న్యాయమైన డిమాండ్ల సాధనకోసమే ఈ పోరాటం
- యాజమాన్యాలు స్పందించకపోవడం వల్లే ధర్నా చేయాల్సి వస్తోంది
- తెలంగాణ పవర్ జేఏసీ
- నేడు విద్యుత్ సౌధ వద్ద మహాధర్నా

తెలంగాణ బ్యూరో :

తెలంగాణలోని విద్యుత్ ఉద్యోగుల ధర్నాపై యాజమాన్యం చేస్తున్న బెదిరింపులకు తాము భయపడేది లేదని తెలంగాణ పవర్ జేఏసీ నేతలు తేల్చిచెప్పారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ కన్వీనర్ సాయిబాబా మాట్లాడుతూ.. యాజమాన్యం జారీ చేసే నోటీసులు

మిగతా 2వ పేజీలో..

## విద్యుత్ రంగంలో కొత్త దిశగా తెలంగాణ

- రాష్ట్రాన్ని క్లీన్ ఎనర్జీ తయారీ కేంద్రంగా చేస్తాం
- పెట్టుబడిదారులకు స్వర్గధామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఇండియా ఎనర్జీ సమ్మిట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్





## చంపత్ రాయ్, అనిల్ మిశ్రాకు సిట్ క్లీన్‌చిట్

- అయోధ్య రామ మందిర విరాళాల కేసులో కొనసాగుతున్న దర్యాప్తు
- మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు ఊరట
- మాజీ సభ్యుడు అనిల్ మిశ్రాకు కూడా క్లీన్‌చిట్
- ఇద్దరిపై ఎలాంటి నేరపూరిత తప్పిదం లేదన్న ఎస్ఐటీ
- ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి తుది నివేదిక సమర్పణ
- నివేదికను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు అందజేత

## హరీశ్‌రావు అబద్ధాల రావు

- పొంగులేటి తీవ్ర విమర్శలు
- ప్రైవేట్ భూములకు 22ఏ నుంచి విముక్తి
- సాంకేతిక సమస్యలు తలెత్తాయని వెల్లడి
- ప్రజలకు భేషరతుగా క్షమాపణలు
- హరీశ్ విమర్శలు హాస్యాస్పదమని వ్యాఖ్య
- ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు
- నెలాఖరు నాటికే భూ సమస్యల పరిష్కారం
- అధికారులకు పొంగులేటి కఠిన ఆదేశాలు



హైదరాబాద్, :

మాజీ మంత్రి, బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్‌రావుపై తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంచలన విమర్శలు చేశారు. హరీశ్‌రావు తన రాజకీయ పబ్బం గడుపుకోవడానికి అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ఆయన పేరును 'అబద్ధాల రావు'గా మార్చుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు. నిషేధిత భూముల (22ఏ) వ్యవహారంలో హరీశ్‌రావు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఒక ప్రముఖ వార్తా ఛానెల్‌తో ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన, ప్రైవేట్ ఆస్తులు 22ఏ జాబితాలోకి వెళ్లడం వెనుక ఉన్న సాంకేతిక కారణాలను వివరంగా వెల్లడించారు. తాము తప్పును దాచిపెట్టేందుకు ప్రయత్నించడం లేదని, బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా ప్రజలకు నిజాన్ని వివరించామని స్పష్టం చేశారు. 22ఏ జాబితా కారణముగా ప్రైవేట్ ఆస్తుల రిజిస్ట్రేషన్లకు విఘాతం కలిగిందనేది వాస్తవమేనని, అయితే ఈ సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పొంగులేటి తెలిపారు. భూముల క్లియరెన్స్

మిగతా 2లో..

## అన్యాయంగా ఓట్లను తొలగించారు

- తెలంగాణలో 73 లక్షల ఓట్లు డిలిట్
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్
- హైదరాబాద్‌లో బీఎల్‌వోలు ఇళ్లకు వెళ్లలేదని విమర్శ
- పేదలు, వలస కూలీల ఓట్లే ఎక్కువగా తొలగించారని వ్యాఖ్య
- 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి అందుబాటులో ఉందని ప్రశ్న
- రాష్ట్రంలో 73 లక్షల ఓట్లు తొలగించారని ఆరోపణ
- మొత్తంగా 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని వ్యాఖ్య
- డీలిమిటేషన్, పోలింగ్ కేంద్రాల మార్పుతో పాత వివరాల్లో గందరగోళం
- ఎన్నికల సంఘాన్ని కేంద్రం తన జేబు సంస్థగా మార్చుకుందని విమర్శ




హైదరాబాద్, :

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో తెలంగాణలో ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఎస్ఐఆర్ ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఎవరి ఇళ్లకూ వెళ్లలేదని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. పేదలు, వలస కూలీల ఓట్లనే ఎక్కువగా తొలగించారని అన్నారు. 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి

మిగతా 2వ పేజీలో..

## భూమిలేని పేదలకు ఎకరం..

- భూ లక్ష్మి పథకం కింద పేదలకు ఎకరం చొప్పన ఇస్తామన్న కవిత
- రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలేనని విమర్శ
- రాష్ట్రంలో రేవంత్, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ సాగుతోందని ఆరోపణ




హైదరాబాద్, :

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం' కింద భూమి లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని

మిగతా 2లో..

## భూ దందాలపై ఈటల ధ్వజం!

- కాంగ్రెస్ పాలనలో భూ అక్రమాలు రెండింతలు
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన ఆరోపణ
- సెక్షన్ 22 ఏ నిషేధిత జాబితాలో భూములు చేర్చడంపై ఆగ్రహం
- భూములను లాక్కొని భూమాఫియాకు కట్టబెట్టే కుట్ర
- ధరణి పోర్టల్ స్థానంలో ఏమాత్రం మార్పు రాలేదని విమర్శ
- రేవంత్ సర్కార్ సెటిల్‌మెంట్ చేసుకుంటోందని వ్యాఖ్యలు



హైదరాబాద్, :

రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాల కంటే ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనే భూ దోపిడీ రెండింతలు పెరిగిందని భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ మరియు రేవంత్ రెడ్డి ప్రభుత్వాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు గతంలో ప్రజలకు కేటాయించిన స్థలాలు, పరిశ్రమల ఏర్పాటు కోసం ఇచ్చిన భూములు, చివరికి ప్రభుత్వమే

మిగతా 2లో..

## యాజమాన్యాల బెదిరింపులకు
# తలొగ్గేది లేదు..

మొదటిపేజీ తరువాయి

మామూలుగా వచ్చేవేనని, వాటికి భయపడాల్సిన పనిలేదన్నారు. గత నెల 18వ తేదీనే నాలుగు కంపెనీల యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చామని, వారి నుండి ఎలాంటి స్పందన లేకపోవడం వల్లే ఆందోళనకు సిద్ధమయ్యామని స్పష్టం చేశారు. తమ హక్కులను కాలరాయడానికి యాజమాన్యాలు అవలంబిస్తున్న ఏకపక్ష విధానాలపైనే తాము నిరసన తెలుపుతున్నామని, దీనికి నాలుగు కంపెనీల యాజమాన్యాలదే పూర్తి బాధ్యత అని సాయిబాబా అన్నారు. పనిభారం విపరీతంగా పెరిగిందని, తక్షణమే ఖాళీలన్నీ భర్తీ చేయాలని కోరినా యాజమాన్యాలు పట్టించుకోలేదని మండిపడ్డారు. మహారాష్ట్రలో అమలు చేసిన విధంగా రైతు డిస్కం ఏర్పాటు చేయాలని కోరినా స్పందన లేదని, అన్ని క్యాడర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంలోనూ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. తమ ముందుంచిన 14 ప్రధాన డిమాండ్లపై కనీసం చర్చలకు కూడా పిలవకుండా మొండి వైఖరి ప్రదర్శించడమే నేటి మహాధర్నాకు ప్రధాన కారణమని స్పష్టం చేశారు. మా సంస్థల్లో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని జేఏసీ నేతలు హెచ్చరించారు. నేడు విద్యుత్ సౌధ కేంద్రంగా జరగనున్న మహాధర్నాలో రాష్ట్రవ్యాప్తంగా వేలాదిగా ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిసియన్లు అందరూ సంఘటితంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో జేఏసీ నేతలు రత్నాకర రావు, జేఎల్ జనప్రియ, సదానందం, తాజోద్దీన్ బాబా తదితర వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# విద్యుత్ రంగంలో కొత్త దిశగా తెలంగాణ

- **రాష్ట్రాన్ని క్లీన్ ఎనర్జీ తయారీ కేంద్రంగా చేస్తాం**
- **పెట్టుబడిదారులకు స్వర్గధామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం**
- **ఇండియా ఎనర్జీ సమ్మిట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
- **ఏఐ టెక్నాలజీతో వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నాం**
- **టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్**

**హైదరాబాద్, ఆగస్టు 18 :**

తెలంగాణలోని విద్యుత్ సంస్థలు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని దేశంలోనే ముందుంటున్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌నోవాటెల్‌లో నిర్వహించిన 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో 2026' కార్యక్రమాన్ని ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణను పెట్టుబడిదారులకు స్వర్గధామంగా, క్లీన్ ఎనర్జీ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. ప్రజలకు చేరువయ్యే ప్రతి వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందంజలో ఉంటుందని స్పష్టం చేశారు. సమ్మిట్‌లో భాగంగా నిర్వహించిన 'మాడర్నైజింగ్ ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ స్మార్ట్ గ్రిడ్స్ ఫర్ ఎ రిలయబుల్ పవర్ ఫ్యూచర్' ప్యానెల్ చర్చలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ పాల్గొని సంస్థలో అమలు చేస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సు, నెట్‌వర్క్ మ్యాపింగ్ మరియు స్మార్ట్ మీటరింగ్ కార్యక్రమాల గురించి వివరించారు. టీజీఎస్పీడీసీఎల్‌లో ప్రతిరోజూ, ప్రతివారం విద్యుత్ వ్యవస్థ పనితీరుపై సమగ్ర విశ్లేషణలు నిర్వహిస్తున్నామని, ఏఐ సాంకేతికత ద్వారా తక్కువ సమయంలో భారీ డేటాను విశ్లేషించి నష్టాలను తగ్గించడంతోపాటు నాణ్యమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు.

**నెట్‌వర్క్ మ్యాపింగ్ - స్మార్ట్ మీటరింగ్ విశేషాలు**

జూలై నెలలోనే సంస్థ విద్యుత్ నెట్‌వర్క్‌కు సంబంధించిన 'ఎండ్‌టుఎండ్ నెట్‌వర్క్ మ్యాపింగ్' పూర్తి చేసిందని సీఎండీ జితేష్ వి. పాటిల్ తెలిపారు. వినియోగదారుల యూఎస్‌సీ నంబర్ ఆధారంగా విద్యుత్ సరఫరా ఏ పోల్, ఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్, ఏ సబ్‌స్టేషన్, ఏ ఫీడర్ ద్వారా వస్తోందో కచ్చితంగా గుర్తించే సామర్థ్యాన్ని సాధించామన్నారు. హైదరాబాద్ నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ కేబులింగ్ విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారులు ఫిర్యాదు చేయకముందే సమస్యలను గుర్తించి పరిష్కరించవచ్చని, బిల్లులు పెరుగుతాయనే అపోహలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టానికి అనుగుణంగా వినియోగదారుల డేటా గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ట్రాన్స్‌కో సీఎండీ డి. కృష్ణ భాస్కర్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కె. వరుణ్ రెడ్డి, డైరెక్టర్లు వి. శివాజీ, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎండీ జితేష్ వి. పాటిల్ ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన వివిధ సాంకేతిక ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించి పరిశీలించారు.






# పాపన్న స్ఫూర్తితో బహుజనుల తెలంగాణ

కాబట్టే ఆయనకు ఆ కీర్తి, గౌరవం దక్కిందని వివరించారు. వందల ఏళ్లు గడిచినా ఆయనను తలుచుకుంటున్నామంటే ఆయన పోరాటం ఎంత అద్భుతమైనదో అర్థం చేసుకోవచ్చునన్నారు. ఈ అద్భుతమైన విగ్రహాన్ని కాపాడుకునే బాధ్యత గౌడ సోదరులదేనని అన్నారు. విగ్రహం దగ్గర మంచి వెలుగుల ఏర్పాట్లతోపాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు ఇస్తున్నానన్నారు. తెలంగాణ అమరవీరుల స్థూపం స్థాయిలో పాపన్న గౌడ్ విగ్రహానికి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. పండుగ సాయన్న పోరాటం, పౌరుషం పాలమూరు జిల్లాలో అందరికీ తెలుసునంటూ అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని చెప్పారు. ఇది సామాజిక న్యాయం, సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వం. ఈ ప్రభుత్వం అందరిది అన్నారు. బాలా గౌడ్, మల్లికార్జున్ గౌడ్ లాంటి నాయకులు కాంగ్రెస్ పార్టీలో ఎదిగారు. మహేష్ గౌడ్ గాంధీ భవన్‌లో కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్నప్పుడు తాను, భట్టి విక్రమార్క రాష్ట్రం అంతా పాదయాత్ర చేశాం. పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, ముఖ్యమంత్రిగా తాను పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాం అని రేవంత్ చెప్పారు. గౌడన్నలు నూటికి నూరు శాతం సహకరించాలని కోరారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని, అర్హులైన నేత, గీత కార్మికులు ఎంతమంది ఉన్నా అందరికీ పింఛన్లు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చానని చెప్పారు. ప్రభుత్వ పొలాల్లో ఈత, తాటి మొక్కలు నాటేలా చూస్తామన్నారు. కాల్వ గట్లపైన కూడా ఈత, తాటి మొక్కలు నాటాలన్నారు. పదేళ్లు పరిపాలించిన వాళ్లు తమ దగ్గర ఉన్న అక్రమ సంపాదనతో మీడియా, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు ప్రసారం చేస్తున్నారని విమర్శించారు. బర్రెలు, గొర్రెలు పెంచుకోండి, చెప్పులు కుట్టుకోండి.. చేపలు పట్టుకోండి అని గత ప్రభుత్వం చెప్పిందని, మనం బర్రెలు, గొర్రెలు పెంచుకుంటుంటే వాళ్ల పిల్లలు రాజ్యాలు ఏలుతారని ఆనాటి ప్రభుత్వ పెద్దలు చెప్పారని ఆయన ఎద్దేవా చేశారు. తరతరాల కులవృత్తితోనే పిల్లలను చదివించుకున్నారు. ఆ వర్గాల పిల్లలు చదివి వైద్యులు, న్యాయవాదులు, ఐఏఎస్‌లుగా మారి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆనాడు తాను చెప్పానన్నారు. ఈనాడు చైతన్యం వచ్చింది. చదువుకోవడం వల్ల మధు యాష్కీ గౌడ్ అమెరికా వెళ్లారు. రాజకీయాల్లోకి వచ్చి ఎంపీ అయ్యారు. కుల వృత్తిని కొనసాగించండి, గౌరవించండి. కానీ పిల్లలను మాత్రం చదివించండి. విద్యార్థుల కోసం ఎన్ని కోట్లైనా కేటాయిస్తాం. నాణ్యమైన విద్యతోపాటు భోజనం కూడా ఇస్తాం. గతంలో సంక్షేమ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం పెట్టలేదు. తమ ప్రభుత్వం పాఠశాలల్లో సన్న బియ్యంతో భోజనం, నాణ్యమైన అల్పాహారం అందిస్తున్నది.. పాలు, రాగి జావ ఇస్తున్నాం.. మన పిల్లలు రాజ్యాలు ఏలాలంటే చదువు ఒక్కటే పరిష్కారం అని చెప్పారు. కష్టమైనా, నష్టమైనా పిల్లలను బడికి పంపించాలి.. వాళ్లను చదివించే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుంది సీఎం అన్నారు. ఏటీసీల్లో చేరేవాళ్లకు నెలకు రూ.2 వేల ఉపకార వేతనం ఇస్తున్నామన్నారు. గౌడ సోదరులకు 50 వేల కాటమయ్య కిట్లను పంపిణీ చేశామని, ప్రమాదవశాత్తు గౌడ సోదరులు చనిపోతే రూ.5 లక్షల పరిహారం చెల్లిస్తున్నామని చెప్పారు. ఈ ప్రభుత్వం మనది అని చెప్పండి. రెండోసారి 117 సీట్లు గెలుస్తున్నాం. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే ఆయన కొడుకు కేటీఆర్‌ను కార్యనిర్వాహక అధ్యక్షుడిని చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే మహేష్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని చేసింది.. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే హరీష్ రావు, కేటీఆర్ మంత్రులయ్యారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే పొన్నం, వాకిటి, సీతక్క, కొండా సురేఖ మంత్రులయ్యారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే సంతోష్ రావును రాజ్యసభకు పంపారు. తాను ముఖ్యమంత్రి అయితే అనిల్ కుమార్ యాదవ్‌ను, వేం నరేందర్ రెడ్డిని రాజ్యసభకు పంపాను. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే ఓడిపోయిన వినోద్ రావును ప్రణాళికా సంఘం చైర్మన్‌ను చేశారు.. తాను కోదండరామ్‌ను ఎమ్మెల్సీని చేశాను. కేసీఆర్ సీఎం అయితే తన బిడ్డను ఎంపీ, ఎమ్మెల్సీ చేశాడు.. తాను వీరనారి చాకలి ఐలమ్మ మనవరాలిని, శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మలను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులుగా నియమించానని గుర్తు చేశారు. కేసీఆర్‌ది కుటుంబ న్యాయం.. మాది సామాజిక న్యాయం.. కేసీఆర్‌ది దొరల న్యాయం.. మాది సామాజిక న్యాయం అని చెప్పారు. వందల ఎకరాల్లో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారని ఆయన ఆరోపించారు. తాము గ్రామగ్రామాన ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామంటూ కేసీఆర్ పదేళ్లలో కడితే 20 లక్షల ఇళ్లు నిర్మాణం అయ్యేవన్నారు. కానీ ఆయనకు పేదోడి ఇంటిపై ఆలోచన లేదని, దిశ సరిగా లేకపోతే దశ సరిగా ఉండదని అన్నారు. ఈ ప్రభుత్వం మీది. ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాలి అని పిలుపునిచ్చారు. అందెశ్రీ పాటకు విముక్తి కల్పించామని, గద్దర్ పేరును శాశ్వతంగా నిలిపామని, బీసీ కులగణన చేశామని, ఎస్సీ వర్గీకరణ చేశామని, నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్నామని వివరించారు. రూ.8 లక్షల 11 వేల కోట్ల అప్పు మాకు ముప్పుగా మారిందన్నారు. ఏడాదికి రూ.75 కోట్ల వడ్డీని కేసీఆర్ అప్పులకు కడుతున్నామన్నారు. రూ.36 వేల కోట్ల రైతు భరోసా ఇచ్చాం.. రూ.95 వేల కోట్లతో ధాన్యం కొనుగోలు చేశాం.. రూ.60 వేల కోట్ల బ్యాంకు అనుసంధాన రుణాలను మహిళా సంఘాలకు ఇచ్చాం అని చెప్పారు. యంగ్ ఇండియా సమగ్ర పాఠశాలలను ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. యంగ్ ఇండియా క్రీడా విశ్వవిద్యాలయం, క్రీడా అకాడమీని ప్రారంభించుకున్నామన్నారు. తాము చేసినవన్నీ చెబితే వాళ్లు ఇంట్లో నుంచి బయటకు రారని, చెబుతున్న అబద్ధాలను నమ్మడం లేదని కర్ణాటక, తమిళనాడుకు వెళ్లి అఘోరా రావు చేతబడి పూజలు చేయించి వచ్చాడని సీఎం రేవంత్ విమర్శించారు. అధికారం కోసం ఇంతకు దిగజారుతారా అని ప్రశ్నించారు. ఏది ఉన్నా మాట్లాడుకుని ముందుకు వెళ్దాం.. ఈ ప్రభుత్వం మనది అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, సీతక్క, ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంత రావు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, విప్ బీర్ల ఐలయ్య, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, శ్రీ గణేష్, ప్రకాష్ గౌడ్, మందుల సామెల్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, రాజేష్ రెడ్డి, మాజీ ఎంపీ మధు యాష్కీ, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# హరీశ్‌రావు అబద్ధాల రావు

మొదటిపేజీ తరువాయి

కోసం ప్రభుత్వం డబ్బులు వసూలు చేస్తోందంటూ హరీశ్‌రావు చేసిన ఆరోపణలను ఆయన పూర్తిగా ఖండించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూములు కాని వాటిని, ప్రైవేట్ వ్యక్తుల హక్కు భుక్తాల్లో ఉన్న భూములను కచ్చితంగా నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని హామీ ఇచ్చారు. గత కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగా తాము నిందలను ఇతరులపై నెట్టివేసి దబాయించే రకం కాదని తేల్చి చెప్పారు. ఈ భూ సమస్యలు ఎందుకు తలెత్తాయో వివరిస్తూ.. 1998 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుండి ఇప్పటి వరకు జీవోలు, ప్రభుత్వ మెమోల ద్వారా హక్కులు పొందిన భూముల వివరాలను గత ప్రభుత్వం ఆన్‌లైన్ డేటాబేస్‌లో సరిగ్గా అప్‌లోడ్ చేయలేదని పొంగులేటి వెల్లడించారు. సాఫ్ట్ కాపీలు అందుబాటులో లేకపోవడంతో, హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లాల కలెక్టర్లు పాత రికార్డుల ఆధారంగా 22ఏ జాబితాను సిద్ధం చేసి అప్‌లోడ్ చేశారని, దానివల్లనే ఈ సాంకేతిక సమస్య ఉత్పన్నమైందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తాము ముందుగానే గుర్తించి, యుద్ధప్రాతిపదికన రికార్డుల ప్రక్షాళన పూర్తి చేస్తున్నామని చెప్పారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం పట్ల పూర్తి చిత్తశుద్ధి, నిబద్ధత ఉన్నాయని మంత్రి పునరుద్ఘాటించారు. సాంకేతిక కారణాల వల్ల ప్రజలకు జరిగిన ఇబ్బందికి అధికారుల తరఫున తానే స్వయంగా క్షమాపణలు చెప్పానని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ పాలనలో 'ధరణి' పోర్టల్ తెచ్చిన తిరోగమన మార్పుల వల్ల ఎంతోమంది సామాన్యులు ఆస్తులు కోల్పోయి రోడ్డున పడ్డారని, ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్నా నాటి ప్రభుత్వం కనీసం స్పందించలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులకు నిజంగా నిబద్ధత ఉంటే నాటి ధరణి అక్రమాలపై గుండెల మీద చేయి వేసుకుని సమాధానం చెప్పాలని సవాలు విసిరారు. హైదరాబాద్ కోర్ ఏరియాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయబద్ధమైన భూ యజమానుల ఆస్తులకు తమ ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. గతంలో మాదిరిగా ప్రభుత్వ ఆస్తులను బంధువులకు, అనుచరులకు పంచిపెట్టే సంస్కృతి తమది కాదని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈ నెలాఖరు నాటికే సమస్యలన్నింటినీ పరిష్కరించేలా గడువు విధించామని తెలిపారు. అర్హులైన ప్రజలకు ఎలాంటి ఆటంకం కలగకుండా రిజిస్ట్రేషన్లు వేగవంతం చేస్తామన్నారు.

22ఏ సమస్యను శాశ్వతంగా, వేగంగా పరిష్కరించడానికి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల ఐజీ లోకేశ్, రాజీవ్ గాంధీలతో పాటు మరొక ముగ్గురు కీలక అధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కమిటీ రాబోయే 15 రోజుల పాటు ప్రతిరోజూ సమావేశమై, హైదరాబాద్ కోర్ ప్రాంతంతో పాటు ఇతర జిల్లాల్లో ఉన్న నిజమైన హక్కుదారుల వినతులను పరిశీలించి తక్షణ పరిష్కారం చూపిస్తుందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తు చేసుకునే ప్రజలకు ఎలాంటి అవస్థలు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి చెప్పారు. స్లాట్ల కొరత ఏర్పడితే తక్షణమే అదనపు స్లాట్లను అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ పారదర్శక చర్యల వల్ల ప్రైవేట్ భూ యజమానులకు ఎలాంటి నష్టం జరగదని, భూములపై పూర్తి హక్కులు పునరుద్ధరించబడతాయని ఆయన భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీ కలిసి చేసే కుట్రలను తిప్పికొడతామని పొంగులేటి హెచ్చరించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం పక్కన పెట్టి, కేవలం వార్తల్లో నిలవడానికే హరీశ్‌రావు అనుచిత విమర్శలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో పారదర్శక పాలన అందిస్తూ, ప్రజల ఆస్తులకు భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.





# భూ దందాలపై ఈటల ధ్వజం!

మొదటిపేజీ తరువాయి

స్వయంగా లేఅవుట్లు వేసి విక్రయించిన భూములను కూడా ఇప్పుడు 22 ఏ (వివాదాస్పద/నిషేధిత) జాబితాలో చేర్చడం దారుణమని ఆయన మండిపడ్డారు.

రైతులు దశాబ్దాలుగా నమ్ముకుని సాగు చేసుకుంటున్న భూములను దౌర్జన్యంగా లాక్కోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఈటల ఆరోపించారు. పేదలు, రైతుల నుంచి భూములను బలవంతంగా స్వాధీనం చేసుకుని, వాటిని రియల్ ఎస్టేట్ మరియు భూమాఫియాకు దారాదత్తం చేయడమే ప్రభుత్వాల ప్రధాన నైజంగా మారిందని ధ్వజమెత్తారు. ధరణి పోర్టల్ స్థానంలో కొత్త మార్పులు తీసుకొచ్చామని చెప్తున్నప్పటికీ, ప్రజల భూములను లాక్కునే ప్రభుత్వాల ధోరణిలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన వ్యాఖ్యానించారు.

గత కేసీఆర్ ప్రభుత్వం భూ దందాలకు మరియు అక్రమాలకు పాల్పడితే, ఇప్పటి రేవంత్ రెడ్డి సర్కార్ ఆ భూములను తమకు అనుకూలంగా 'సెటిల్ మెంట్లు' చేసుకుంటోందని సంచలన ఆరోపణలు చేశారు. గతంలో జరిగిన హుజూరాబాద్ శాసనసభ ఉప ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నాయకులు నీళ్లలా ఖర్చు చేసిన రూ. వందల కోట్లు ఇలాంటి భూ దందాలు, అక్రమ మార్గాల ద్వారా సంపాదించినవేనని ఆయన విమర్శించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని పేదల కడుపు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ శివారులోని గల్ఫ్ ఆయిల్ కంపెనీకి చెందిన భూములు ఫీనిక్స్ కంపెనీ మీదుగా ఏ రకంగా చేతులు మారాయో రాష్ట్ర ప్రజలందరికీ బాగా తెలుసని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఈ భూ మార్పిడి వ్యవహారంలో, అక్రమాల్లో బడా రాజకీయ నాయకుల హస్తం ఉందని ఆరోపించారు. ప్రభుత్వాలు పేదలకు, రైతులకు న్యాయం చేయాల్సింది పోయి, బడా రియల్ ఎస్టేట్ మాఫియాలకు, బిల్డర్లకు కొమ్ము కాయడం తగదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ బాధితులైన పేదలు, రైతుల తలరాతలు మారడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి సంపాదించుకున్న సొంత భూములను 22 ఏ జాబితాలో చేర్చడంతో సామాన్యులు రిజిస్ట్రేషన్లు కాక, అవసరాలకు అమ్ముకోలేక తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని తెలిపారు. భూ హక్కుల రక్షణ కోసం బాధితులు అధికారుల చుట్టూ, ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోందని మండిపడ్డారు. ఈ రకమైన భూ అరాచకాలు, అక్రమ సెటిల్‌మెంట్లను బీజేపీ చూస్తూ ఊరుకోదని ఈటల స్పష్టం చేశారు. పేదలు, రైతుల హక్కులను కాపాడే వరకు తమ పార్టీ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని తేల్చి చెప్పారు. సేకరించిన భూములను తిరిగి బాధితులకు అప్పగించే వరకు, 22 ఏ నిషేధిత జాబితా నుంచి సామాన్యుల భూములను తొలగించే వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాడతామని ఆయన పునరుద్ఘాటించారు.

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి భూ బాధితులకు న్యాయం చేయాలని, 22 ఏ జాబితా పేరుతో చేస్తున్న వేధింపులను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసం కాకుండా, పేద రైతు కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు. అక్రమాలకు పాల్పడుతున్న ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ముగింపుగా, ప్రజా సమస్యలపై బీజేపీ ఎల్లప్పుడూ ముందుంటుందని, భూ బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయ సహాయం మరియు రాజకీయ మద్దతు అందిస్తుందని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ప్రభుత్వాలు తమ వైఖరిని మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



# చంపత్ రాయ్, అనిల్ మిశ్రాకు సిట్ క్లీన్‌చిట్

- అయోధ్య రామ మందిర విరాళాల కేసు లో కొనసాగుతున్న దర్యాప్తు
- మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు ఊరట
- మాజీ సభ్యుడు అనిల్ మిశ్రాకు కూడా క్లీన్‌చిట్
- ఇద్దరిపై ఎలాంటి నేరపూరిత తప్పిదం లేదన్న ఎస్ఐటీ
- ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి తుది నివేదిక సమర్పణ
- నివేదికను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు అందజేత
- విరాళాల లెక్కింపులో అక్రమాలపై కొనసాగిన దర్యాప్తు
- జూన్‌లో పదవులకు రాజీనామా చేసిన చంపత్ రాయ్, అనిల్ మిశ్రా
- విరాళాల చోరీకి సంబంధించి ఎనిమిది మందిని నిందితులుగా గుర్తింపు
- లెక్కింపు, నగదు తరలింపు సిబ్బందిపైనే కేసు
- ఆరోపణలు నిరాధారమన్న చంపత్ రాయ్

**నేషనల్‌బ్యూరో, :**

అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసులో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, మాజీ సభ్యుడు అనిల్ మిశ్రాకు ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటీ) క్లీన్‌చిట్ ఇచ్చింది. విరాళాల చోరీకి సంబంధించి తుది దర్యాప్తు నివేదికను ఎస్ఐటీ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సమర్పించింది. ప్రభుత్వం ఆ నివేదికను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు అందజేసింది.

ఎస్ఐటీ నివేదిక ప్రకారం చంపత్ రాయ్, అనిల్ మిశ్రా పేర్లను నిందితుల జాబితాలో చేర్చలేదు. ఇద్దరి విషయంలోనూ నేరపూరిత తప్పిదం గుర్తించలేదని దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. మరోవైపు విరాళాల చోరీకి సంబంధించి ఎనిమిది మందిని నిందితులుగా గుర్తించినట్లు సమాచారం.

**జూన్‌లో రాజీనామా**

రామ మందిర విరాళాల లెక్కింపు, నిర్వహణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో చంపత్ రాయ్, అనిల్ మిశ్రా జూన్‌లో తమ పదవులకు రాజీనామా చేశారు. అనంతరం ఇద్దరినీ ఎస్ఐటీ విచారించింది. విరాళాల సేకరణ, లెక్కింపు, భద్రత, బ్యాంకులో జమ చేసే ప్రక్రియకు సంబంధించిన వివరాలను దర్యాప్తు బృందం సేకరించింది. తొలుత వెలువడిన ఎస్ఐటీ దర్యాప్తు వివరాల్లో విరాళాల లెక్కింపు సమయంలో సిబ్బంది నగదును దాచుకుని బయటకు తీసుకెళ్లిన ఘటనలు గుర్తించినట్లు వెల్లడైంది. సీసీటీవీ దృశ్యాలను పరిశీలించిన దర్యాప్తు బృందం భద్రతా వ్యవస్థలో లోపాలను కూడా గుర్తించింది.

**ఎనిమిది మందిపై కేసు**

చివరి నివేదికలో చంపత్ రాయ్, అనిల్ మిశ్రాను నిందితులుగా చేర్చలేదు. విరాళాల లెక్కింపు, తరలింపు బాధ్యతల్లో ఉన్న ఎనిమిది మందిని నిందితులుగా గుర్తించినట్లు ఎస్ఐటీ నివేదికపై సమాచారం వెల్లడైంది. వారిపై ఇప్పటికే కేసులు నమోదు చేసి అరెస్టులు చేసినట్లు అధికారులు తెలిపారు.

**ఆరోపణలు నిరాధారమన్న రాయ్**

తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమని చంపత్ రాయ్ గతంలోనే పేర్కొన్నారు. ఎస్ఐటీ నివేదిక ప్రభుత్వానికి సమర్పించిన తర్వాతే ఈ వ్యవహారంపై స్పందిస్తానని ఆయన తెలిపారు. తాజా నివేదికలో తన పేరు నిందితుల జాబితాలో లేకపోవడంతో ఆయనకు ఊరట లభించినట్లయింది.

అయితే ఈ కేసులో దర్యాప్తు పూర్తిగా ముగిసిందా, తదుపరి చట్టపరమైన చర్యలు ఏమిటనే అంశంపై సంబంధిత సంస్థల నిర్ణయాలు కీలకం కానున్నాయి. ఇదే సమయంలో రామ మందిర విరాళాల వ్యవహారంపై సుప్రీంకోర్టు కూడా ఎస్ఐటీ నుంచి స్థితిగతుల నివేదిక కోరిన నేపథ్యంలో తదుపరి పరిణామాలపై ఆసక్తి నెలకొంది.

# భూమిలేని పేదలకు ఎకరం..

**మొదటిపేజీ తరువాయి**

ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలే కావచ్చు కానీ, పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి అంటే పంచప్రాణాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా పేదల అసైన్డ్ భూములనే లాక్కుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సోదరులు, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ, రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం దాదాపు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కుందని, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పేదల అసైన్డ్ భూములపై వారికే పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి 'మేకవన్నె పులి' లాంటి వారని... ఆయన చెప్పేది సామాజిక న్యాయం అయితే, చేసేది ఆటవిక న్యాయమని విమర్శించారు. కేబినెట్ తో పాటు ప్రభుత్వ సలహాదారులు, ఆర్టీఐ కమిషనర్ల నియామకాల వరకు బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అగ్ర వర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరొక న్యాయం నడుస్తోందని మండిపడ్డారు.



# అన్యాయంగా ఓట్లను తొలగించారు

**మొదటిపేజీ తరువాయి**

అందుబాటులో ఉందని ప్రశ్నించారు.

**73 లక్షల ఓట్లు తొలగించారని ఆరోపణ**

రాష్ట్రంలో అకారణంగా 73 లక్షల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించిందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. మొత్తంగా 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో 73.39 లక్షల ఎన్‌యూమరేషన్ ఫారాలు 'అన్‌కలెక్టబుల్'గా నమోదైన అంశంపై ఇప్పటికే రాజకీయంగా వివాదం కొనసాగుతోంది.

డీలిమిటేషన్, పోలింగ్ కేంద్రాల మార్పు కారణంగా 2002 నాటి ఓటర్ల వివరాలు చాలా చోట్ల సరిపోలడం లేదని ఆయన అన్నారు. పాత జాబితాతో ముడిపెట్టకుండా పౌరులకు ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

**ఎన్నికల సంఘంపై విమర్శలు**

కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ మాదిరిగానే ఎన్నికల సంఘాన్ని కూడా తన జేబు సంస్థగా మార్చుకుందని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. లక్షలాది మంది ఓట్లు తొలగించి ప్రజాస్వామ్య దేశమని ఎలా చెప్పగలమని ప్రశ్నించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ల వివరాల్లో అనేక రకాల వ్యత్యాసాలను అధికారులు గుర్తిస్తున్న నేపథ్యంలో, 60 లక్షల మందికిపైగా ఓటర్లకు నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని కూడా ఇటీవల నివేదికలు వెలువడ్డాయి.



# ఉద్యమకారుల పోరాటం ఆధారంగా వర్గీకరణ

- త్వరలోనే ఉద్యమకారుల గుర్తింపునకు చర్యలు
- చైర్మన్ డాక్టర్ కేశవరావుతో కమిటీ సభ్యుల భేటీ
- వర్గీకరణ ముసాయిదా, సంక్షేమ విధివిధానాలపై కీలక సమీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 18 :**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుపై ముసాయిదా తయారీపై ఉద్యమకారుల కమిటీ దృష్టిపెట్టింది. కమిటీ చైర్మన్ డాక్టర్ కె.కేశవరావు (కేకే) తన నివాసంలో కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులతో మంగళవారం అత్యున్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కీలక భేటీలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. అమరదీపం వేదికగా 13వేల మందికిపైగా ఉద్యమకారులు, ప్రజాసంఘాలు, వివిధ జేఏసీలతో 16 రోజులపాటు నిర్వహించిన విస్తృత సంప్రదింపుల ద్వారా సేకరించిన అభిప్రాయాలు, విజ్ఞప్తుల ఆధారంగా రూపొందించిన చర్చలపై ఒక ముసాయిదా నోట్‌పై ఈ సమావేశంలో క్షుణ్ణంగా చర్చించారు.



వర్గీకరణ విభజన ముసాయిదా పరిశీలన

సేకరించిన క్షేత్రస్థాయి సమాచారం ప్రకారం ఉద్యమకారులను కింది గ్రూపులుగా గుర్తించే విధానాన్ని కమిటీ ప్రాథమికంగా పరిశీలించింది.

- మొదటి కేటగిరీ(అమరుల కుటుంబాలు) ఉద్యమ క్రమంలో అమరులైన వారు సుమారు 1400మంది సమాచారం ఉండగా గతంలో కొందరికి మాత్రమే సహాయం అందింది. మిగిలిన అర్హులైన అమరుల కుటుంబాలను గుర్తించి పూర్తి న్యాయం చేయడం.

- రెండవ కేటగిరీ(గాయపడిన ఉద్యమకారులు) పోలీసు కాల్పుల్లో, లాఠీచార్జిల్లో శాశ్వత అంగవైకల్యం పొందిన వారు, ఆత్మహత్యాయత్నాల్లో తీవ్రంగా గాయపడిన వారు.

మూడవ కేటగిరీ(జైలు జీవితం గడిపిన వారు) తొలిదశ (1969), మలిదశ ఉద్యమాల్లో ప్రివెంటివ్ కస్టడీ, రిమాండ్, తీవ్ర జైలు శిక్షలు అనుభవించిన విద్యార్థులు, ఉద్యమకారులు.

- నాల్గవ కేటగిరీ(కేసులు నమోదైన వారు) నాటి ఉద్యమ సమయంలో క్రిమినల్ కేసులు, బెయిలబుల్/నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు ఎదుర్కొన్న శ్రేణులు.

- ప్రత్యేక కేటగిరీలు(సంస్థాగత, క్రియాశీలక శ్రేణులు): కేసులు నమోదు కానప్పటికీ ఉద్యమ నిర్మాణంలో క్రియాశీలకంగా పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా ఉద్యమకారులు, ధూమ్‌ధామ్ కళాకారులు, వివిధ సంస్థల సభ్యులు.

ఉద్యమకారుల ఆకాంక్షలు - సంక్షేమ అభ్యర్థనలు

సత్కారంసహాయంసహకారం: ఉద్యమకారులకు ఈ మూడు విధానాల్లో గౌరవం దక్కాలని కమిటీ స్పష్టం చేసింది.

గుర్తింపు కార్డులు, గౌరవ ప్రదానం: ఉద్యోగులు, వసతి కలిగిన వారు కేవలం గుర్తింపు కార్డు/ప్రశంసా పత్రం ఆశిస్తుండగా నిరుపేద, నిరుద్యోగ యువత 250 గజాల స్థలం, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం, పెన్షన్, ఆర్టీసీ ఉచిత ప్రయాణం, పిల్లలకు ఉచిత విద్య, స్వయం ఉపాధి రుణాలు కోరుతున్నారు.

- చట్టబద్ధత, కార్పొరేషన్: జార్ఖండ్, ఉత్తరాఖండ్ తరహాలో సంక్షేమ పథకాలకు పూర్తి చట్టబద్ధత కల్పించడంతోపాటు శాశ్వత కమిషన్ లేదా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు.

తదుపరి చేపట్టవలసిన చర్యలు ఖరారు

ఉద్యమకారులు దరఖాస్తు చేసుకోవడానికి త్వరలోనే అధికారిక వెబ్‌సైట్/పోర్టల్ ద్వారా అవకాశం కల్పించడం. పారదర్శకమైన ఆన్‌లైన్ దరఖాస్తు నమూనాను సిద్ధం చేయడం. శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులతో విస్తృతస్థాయి చర్చలు జరపడం. మిగిలి ఉన్న ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులతో సంభాషణలు పూర్తి చేయడం. ఇప్పటివరకు జరిగిన అన్ని చర్చల సమగ్ర నివేదికను, మినిట్స్‌ను రూపొందించి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి సమర్పించడం.

# తాగునీటికే తొలి ప్రాధాన్యం

- పంటలకు కూడా భరోసా కల్పించాలి
- అందుబాటులో వున్న జాలాల ఆధారంగా విడుదలపై నిర్ణయాలు
- సింగూరు మరమ్మతుకు అధిక ప్రాధాన్యం
- అంతర్రాష్ట్ర జల వివాదాలపై పటిష్ట వాదనలు
- నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్

**హైదరాబాద్, ఆగస్టు 18:**



ఆకాశం వైపు ఆశగా చూడటం ఒక్కటే జల నిర్వహణ కాదు.. ఆనకట్టలో ఎంత నీరుంది, అందులో నిజంగా వినియోగించగలిగేది ఎంత, తాగునీటికి ఎంత కాపాడాలి, ఉన్న పంటకు ఎంత అందించగలం అన్న ప్రతి లెక్కలో శాస్త్రీయత, వాస్తవికత ఉండాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన వర్షాకాలంపై అనిశ్చితి కొనసాగుతున్నందున తాగునీటి భద్రతకు తొలి ప్రాధాన్యం.. అదే సమయంలో అందుబాటులో ఉన్న నీటితో ఖరీఫ్ పంటలకు గరిష్ఠ రక్షణ అనే సూత్రంతో ముందుకు సాగాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. రాష్ట్రంలోని జలాశయాల నీటిమట్టాలు, ప్రవాహాలు, మిగిలిన ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి అవకాశాలపై మంత్రి మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్, అక్టోబర్ ల్లో భారీగా వర్షాలు కురుస్తాయని, ఎగువ నుంచి పెద్దఎత్తున వరదలు వస్తాయని ముందుగానే ఊహించుకొని నీటి నిర్వహణ ప్రణాళికలు రూపొందించడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం చేతిలో ఉన్న నీరే ప్రామాణికం కావాలి.. నమ్మదగిన ప్రవాహాలే అంచనాలకు ఆధారం కావాలి.. వర్షపాతంపై శాస్త్రీయ విశ్లేషణే నిర్ణయాలకు దిక్సూచి కావాలి అని స్పష్టం చేశారు. 'మన విధానం సమతుల్యంగా, వివేకవంతంగా ఉండాలి. ప్రజల తాగునీటి అవసరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదంలోకి నెట్టకూడదు. అదే సమయంలో తాగునీటి అవసరాలకు మించి అందుబాటులో ఉన్న నీరు జలాశయాల్లో ఉన్నప్పుడు పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఉండకూడదు. ప్రతి నీటి విడుదల నిర్ణయం వాస్తవంగా వినియోగించగల నిల్వలు, నమ్మదగిన ప్రవాహాలు, వాస్తవిక వర్షపాత అంచనాల ఆధారంగానే జరగాలి" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంతంలోని ప్రధాన జలాశయాల్లో మొత్తం 973.68 టీఎంసీల సామర్థ్యానికి గాను 746.12 టీఎంసీల నీరు ఉండి, 76.63 శాతం నిల్వలు నమోదయ్యాయని సమీక్షలో వెల్లడైంది. గోదావరి బేసిన్‌లో 306.20 టీఎంసీల సామర్థ్యానికి 208.38 టీఎంసీలు, అంటే 68.1 శాతం నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. కృష్ణా నదిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న నాగార్జున సాగర్‌లో ప్రస్తుతం సుమారు 164 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు స్థూల సామర్థ్యం సుమారు 312 టీఎంసీలు కాగా, ఇంకా దాదాపు 47 శాతం మేర వరద జలాలను స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాలను అత్యంత జాగ్రత్తగా అంచనా వేయాలని మంత్రి సూచించారు. అయితే జలాశయాల్లో కనిపించే స్థూల నిల్వ శాతాలను మాత్రమే చూపించి పరిస్థితి ఎంతో ఆశాజనకంగా ఉందన్న భావన కలిగించవద్దని అధికారులను హెచ్చరించారు. స్థూల సామర్థ్యం ఎంత? లైవ్ స్టోరేజ్ ఎంత? వాస్తవంగా వినియోగించగల నీరు ఎంత? ఇప్పటికే కేటాయించిన అవసరాలు ఎంత? వాటన్నింటినీ మినహాయించిన తర్వాత సాగునీటికి మిగిలేది ఎంత అన్న వివరాలు ప్రతి నివేదికలో స్పష్టంగా ఉండాలని ఆదేశించారు. 2025, 2026 సంవత్సరాల నిల్వలు, ప్రవాహాలను తులనాత్మకంగా అధ్యయనం చేసి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. మిగిలిన ఖరీఫ్ లో ప్రభుత్వం ముందున్న లక్ష్యం స్పష్టమని మంత్రి పేర్కొన్నారు. నమ్మదగిన ప్రతి నీటి వనరును సద్వినియోగం చేసుకొని నిలువునా ఉన్న పంటలను కాపాడాలని, ప్రవాహాలపై అనిశ్చితి ఉన్న జలాశయాల్లో నీటిని జాగ్రత్తగా సంరక్షించాలని, రైతులకు వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు పారదర్శకంగా తెలియజేయాలని ఆదేశించారు.

**వైరా రిజర్వాయర్ పరిస్థితిపై సమీక్ష**

వైరా రిజర్వాయర్ పరిస్థితిని ప్రత్యేకంగా సమీక్షించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి గోదావరి జలాలతో తిరిగి నింపుకునే అవకాశం ఉన్నప్పుడు సాగునీటి విడుదలలో జాప్యం ఎందుకు జరుగుతోందని అధికారులను ప్రశ్నించారు. సహజ ప్రవాహాలపై మాత్రమే ఆధారపడే జలాశయాల్లో నీటిని పొదుపుగా వినియోగించడం అవసరమేనని, కానీ నమ్మదగిన ప్రత్యామ్నాయ వనరుల నుంచి తిరిగి నింపుకునే అవకాశం ఉన్నచోట సాగునీటిని అనవసరంగా నిలిపివేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. దేవాదుల, నిజాంసాగర్, స్వర్ణ, సదర్మట్ ఆనకట్ట, రామడుగు, బుగ్గలవాగు, రామపల్లి, పాలెంవాగు, గౌరవవరం, పోచారం, రాజీవ్ సాగర్, నెలవాయి, వట్టివాగు, నల్లవాగు, పాల్వాయి పురుషోత్తంరావు (ఎర్రవాగు), చెల్మెలవాగు (ఎన్టీఆర్ సాగర్) ప్రాజెక్టుల పరిధిలో అందుబాటులో ఉన్న నీటి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, సాగునీటి విడుదలకు అవకాశం ఉన్నచోట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మూసీ జలాలను కూడా సమర్థంగా వినియోగించి రైతులకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో సాగునీటి ప్రణాళికలు జలాశయంలోని వాస్తవ నిల్వలు, వస్తున్న ప్రవాహాలకు అనుగుణంగానే ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. నిజాంసాగర్, లోయర్ మానేరు డ్యామ్, సింగూరు సహా గోదావరి బేసిన్‌లోని ఇతర ప్రధాన జలాశయాల పరిస్థితిని కూడా సమీక్షించారు. సింగూరు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తమ్ ఆదేశించారు. డ్యామ్‌కు అవసరమైన మరమ్మతులు, పటిష్టీకరణ పనులను వేగవంతం చేయాలని, తాజా నీటి నిల్వలను మరోసారి ధ్రువీకరించి సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఇంజినీర్లకు సూచించారు.

**ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల పురోగతి**

శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. ఇన్‌లెట్, అవుట్‌లెట్ రెండు వైపుల నుంచి తవ్వకం కొనసాగుతున్నట్లు అధికారులు వివరించారు. భౌగోళికంగా అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో ఇంజినీర్లు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, భద్రత విషయంలో ఎక్కడా రాజీపడకుండా పనుల వేగాన్ని పెంచాలని మంత్రి ఆదేశించారు. జలవనరులకు సంబంధించిన అన్ని సాంకేతిక అధ్యయనాల్లో కేంద్ర జల సంఘం , భారత వాతావరణ శాఖ తాజా సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కాలం చెల్లిన సమాచారంపై ఆధారపడకుండా నదుల క్రాస్ సెక్షన్లను తాజా పరిస్థితులకు అనుగుణంగా నవీకరించాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలో ఏర్పడే అవకాశం ఉన్న ముంపు ప్రభావంపై అధ్యయనం చేస్తున్న ఐఐటీ నిపుణులతో త్వరితగతిన తదుపరి సంప్రదింపులు జరపాలని మంత్రి ఆదేశించారు. తెలంగాణ భూభాగంలో ఎంతమేర వరద ప్రభావం లేదా ముంపు ఏర్పడే అవకాశం ఉందన్న అంశంపై శాస్త్రీయమైన, తిరుగులేని సాంకేతిక ఆధారాలను సిద్ధం చేయాలని సూచించారు. అవసరమైన రక్షణ చర్యలను కేంద్రం నుంచి కోరేందుకు ఈ అధ్యయనం తెలంగాణకు బలమైన ఆధారంగా నిలవాలని పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై కూడా మంత్రి విస్తృతంగా సమీక్షించారు. ట్రిబ్యునల్‌లో కొనసాగుతున్న విచారణలు, సుప్రీంకోర్టులోని కేసులు, కృష్ణా జలాల నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు పరిధి తదితర అంశాలపై ఇంజినీరింగ్, న్యాయ విభాగాల అధికారులు సమన్వయంతో సంక్షిప్తమైనా సమగ్రమైన నోట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. 'నీరు ప్రకృతి ఇచ్చే సంపద మాత్రమే కాదు.. ప్రజల భవిష్యత్తుకు ప్రభుత్వం నిర్వహించాల్సిన బాధ్యత. తాగునీటిని కాపాడాలి.. రైతు పంటను నిలబెట్టాలి.. రేపటి అవసరాన్ని విస్మరించకుండా నేటి అవసరాన్ని తీర్చాలి. అందుకే ఈ సమయంలో ప్రతి టీఎంసీకి లెక్క ఉండాలి.. ప్రతి విడుదలకు శాస్త్రీయ కారణం ఉండాలి.. ప్రతి నిర్ణయంలో రైతు ప్రయోజనం, ప్రజల తాగునీటి భద్రత ప్రతిబింబించాలి' అన్న దిశలో అధికారులు పనిచేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఇంజినీర్‌ఇన్‌చీఫ్(జనరల్) ఓ.వి.రమేష్ బాబు, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఇంజినీర్‌ఇన్‌చీఫ్(అడ్మినిస్ట్రేషన్) టి.శ్రీనివాస్, ఇంజినీర్‌ఇన్‌చీఫ్ (ఓ అండ్ ఎం, క్వాలిటీ కంట్రోల్) ఆర్.మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్లకు పారిశ్రామిక తోడ్పాటు

- ఇందిరమ్మ ఇళ్లకు రూ.230 కే సిమెంట్ బస్తా
- పరిశ్రమల సామాజిక బాధ్యతకు మంత్రి పొంగులేటి ప్రశంసలు

**హైదరాబాద్, ఆగస్టు 18 :**

పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సిమెంట్ పరిశ్రమలు భాగస్వాములు కావాలని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్ ధరల తగ్గింపుపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, సామాజిక భద్రత, ఆత్మగౌరవాన్ని కల్పించే మహా యజ్ఞమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా(హైదరాబాద్ మినహా) మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే గణనీయ సంఖ్యలో 85 శాతం ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయని, మిగిలిన 15శాతం ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. రెండో విడతలో నియోజకవర్గానికి రెండు వేల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామన్నారు. అలాగే క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రయోగాత్మకంగా 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్‌కు శ్రీకారం చుట్టామన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా 100 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్ట లేదని, ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇంట్లో నివసించే వరకు ప్రభుత్వం తన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తుందని అన్నారు. ఈ బృహత్తరమైన ఇళ్ల పథకంలో సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన సిమెంటును తక్కువ ధరకే అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు కలిసి పనిచేస్తే గుడిసెలు లేని రాష్ట్రం లక్ష్యాన్ని త్వరితగతిన సాధించవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఒక ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రతి వర్గం సహకారం అందించాలని పిలుపునిచ్చారు. పేదవాడికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయమందిస్తే ప్రభుత్వంతోపాటు పరిశ్రమల యాజమాన్యాలను కూడా చిరస్థాయిగా గుర్తుపెట్టుకుంటారని అన్నారు. మంత్రి విజ్ఞప్తి మేరకు ఒక్కో బస్తాను రూ.230లకు ఇవ్వడానికి యాజమాన్యాలు అంగీకరించాయి. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పరిశ్రమల యాజమాన్యాలతోపాటు హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



## సంపాదకీయం




# సోషల్ మీడియాను కట్టడి చేస్తే.. ప్రజాభిప్రాయాన్ని మార్చగలరా?

ప్రజాస్వామ్యంలో ఒకప్పుడు సమాచారాన్ని నియంత్రించడానికి పత్రికలను అడ్డుకోవాల్సి వచ్చేది. తర్వాత టెలివిజన్ ఛానళ్లపై ప్రభావం చూపడం సరిపోయేది. ఇప్పుడు ఆ అవసరం కూడా తగ్గిపోయింది. ప్రజల చేతిలో ఉన్న ఫోన్‌లోకి వచ్చే సమాచారాన్ని నియంత్రిస్తే చాలు అనే స్థాయికి వ్యవస్థలు చేరుతున్నాయా అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. కేంద్ర హోంశాఖ పరిధిలోని సహయోగ్ పోర్టల్ ద్వారా సోషల్ మీడియా వేదికలకు కంటెంట్ తొలగింపు ఆదేశాలు పంపుతున్న వ్యవస్థపై వెలువడుతున్న వివరాలు ఈ ఆందోళనను మరింత పెంచుతున్నాయి. 2024 అక్టోబర్ నుంచి 2025 అక్టోబర్ మధ్య 19 ఆన్‌లైన్ వేదికలకు 2,300కు పైగా బ్లాకింగ్ ఆర్డర్లు పంపినట్టు ఆర్టీఐ ద్వారా వెల్లడైంది. అంటే రోజుకు సగటున ఆరు ఆదేశాలు. అయితే ఒక్కో ఆదేశంలో అనేక లింకులు, ఖాతాలు ఉండే అవకాశం ఉంది. సహయోగ్ పరిధిలోకి వచ్చిన ఆన్‌లైన్ వేదికల సంఖ్య కూడా 118 దాటింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి కోట్లాది మంది ఉపయోగించే వేదికలు కూడా ఈ వ్యవస్థలో భాగమయ్యాయి.

ఇక్కడ మరింత ఆందోళన కలిగించే పరిణామం ఇంకొకటి ఉంది. భారత్‌లో స్థానిక చట్టాల ఆధారంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్‌ను పెద్ద స్థాయిలో ఆటోమేటిక్‌గా పరిమితం చేసే వ్యవస్థను మెటా అమలు చేస్తున్నట్టు సంస్థ వర్గాలను ఉటంకిస్తూ ది హిందూ నివేదించింది. అంటే ఇక ప్రతి పోస్టును ఒక మనిషి కూర్చొని పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేకుండా, ప్రభుత్వ సూచనలను సాంకేతిక వ్యవస్థలు భారీ స్థాయిలో అమలు చేసే పరిస్థితి ఏర్పడుతోంది. ఇది వేగం పెరగడం మాత్రమే కాదు. ఇది అధికార స్వభావంలో మార్పు. ఒక పోస్టును తొలగించడానికి ముందు దాని నిజానిజాలను స్వతంత్రంగా పరిశీలించారా? అది నిజంగా చట్టవిరుద్ధమైనదేనా? ప్రభుత్వాన్ని విమర్శించడం, ఒక ప్రజాప్రతినిధిని విమర్శించడం, తప్పు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, ప్రజలను హింసకు ప్రేరేపించడం... వీటన్నింటికీ మధ్య ఉన్న తేడాను ఎవరు నిర్ణయిస్తున్నారు? ఆ నిర్ణయంపై అప్పీల్ చేసే అవకాశం ఉందా? తొలగించిన కంటెంట్‌కు కారణం ప్రజలకు స్పష్టంగా చెబుతున్నారా?

ఈ ప్రశ్నలకు సమాధానాలు పారదర్శకంగా లేకపోతే సమస్య కేవలం ఒక పోస్టు తొలగింపుతో ముగియదు. ఎందుకంటే సమాచారం కనిపించకుండా చేయడం కూడా ఒక రకమైన అధికారమే. జంతర్‌మంతర్ ఘటన దీనికి తాజా ఉదాహరణ. అక్కడి నిరసనలకు సంబంధించిన కొన్ని పోస్టులు, వీడియోలను తొలగించాలని ఢిల్లీ పోలీసులు సోషల్ మీడియా వేదికలను కోరినట్టు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వెల్లడించింది. చట్టవిరుద్ధమైన లేదా అభ్యంతరకరమైన కంటెంట్‌పై చర్య తీసుకోవడం ప్రభుత్వ బాధ్యతే. కానీ ఒక నిరసనకు సంబంధించిన కంటెంట్‌లో ఏది చట్టవిరుద్ధం, ఏది రాజకీయ విమర్శ, ఏది ప్రజల అభిప్రాయ వ్యక్తీకరణ అనే గీతను ఎవరు గీస్తున్నారు అన్నదే అసలు విషయం.

ప్రజాభిప్రాయాన్ని పూర్తిగా నియంత్రించడం మాత్రం అంత సులభం కాదు. ఒక వేదిక నుంచి తొలగించిన సమాచారం మరో వేదికకు వెళ్లవచ్చు. ఫేస్‌బుక్ నుంచి తొలగించిన వీడియో యూట్యూబ్‌లో ఉండొచ్చు. ఇన్‌స్టాగ్రామ్‌లో కనిపించని విషయం వాట్సాప్ గ్రూపుల్లో తిరగొచ్చు. ఒక ఖాతాను నిలిపివేస్తే మరో ఖాతా రావచ్చు. పైగా ఒక సమాచారాన్ని అణచివేయాలనే ప్రయత్నమే దానిపై ఆసక్తిని మరింత పెంచే అవకాశమూ ఉంది. అందువల్ల సోషల్ మీడియాను నియంత్రించడం ద్వారా ప్రజల ఆలోచనలను పూర్తిగా నియంత్రించగలమని ఎవరైనా భావిస్తే అది భ్రమే. కానీ ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయలేమని అనుకోవడం కూడా అంతే ప్రమాదకరం. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో అభిప్రాయం కేవలం ప్రజలు మాట్లాడటం వల్ల ఏర్పడదు. ప్రజలు ఏ సమాచారాన్ని చూస్తున్నారు, ఏ సమాచారాన్ని మిస్ అవుతున్నారు, ఏ విషయంపై చర్చ జరుగుతోంది, ఏ విషయంపై చర్చే జరగడం లేదు అన్నదానితో కూడా అది నిర్మితమవుతుంది.

ఇదే చోట ప్రభుత్వ నియంత్రణకు మరో కోణం ఉంది. సహయోగ్ పోర్టల్ ఉద్దేశం చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ కంటెంట్‌పై వేగంగా చర్య తీసుకోవడమేనని ప్రభుత్వం చెబుతోంది. చట్టవిరుద్ధమైన కంటెంట్, బాలలపై లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్, హింసను ప్రేరేపించే సమాచారాన్ని అడ్డుకోవడంలో వేగవంతమైన వ్యవస్థ అవసరమే. ప్రభుత్వం కూడా ఇంటర్నెట్‌ను సురక్షితంగా, బాధ్యతాయుతంగా ఉంచడమే లక్ష్యమని చెబుతోంది. కానీ చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను తొలగించడం ఒకటి, ప్రభుత్వానికి అసౌకర్యం కలిగించే కంటెంట్‌ను తొలగించడం మరొకటి. ఈ రెండింటి మధ్య గీత చెరిగిపోకుండా చూడటమే ప్రజాస్వామ్య వ్యవస్థల అసలు పరీక్ష. సహయోగ్ వ్యవస్థపై న్యాయపరమైన అభ్యంతరాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కేంద్రం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అధికారులకు కంటెంట్ తొలగింపు ప్రక్రియలో విస్తృత పాత్ర లభించడం, స్వతంత్ర పరిశీలనకు తగిన స్థలం ఉందా అన్న ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ వ్యవస్థను సవాలు చేస్తూ న్యాయస్థానాల్లో పిటిషన్లు కూడా దాఖలయ్యాయి.

ప్రభుత్వం ప్రజల కోసం సమాచారాన్ని రక్షించాలి. ప్రజల నుంచి సమాచారాన్ని దాచే అధికారం మాత్రం జాగ్రత్తగా, అత్యంత పరిమితంగా మాత్రమే ఉపయోగించాలి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి విమర్శ అంటే శత్రుత్వం కాదు. అసమ్మతి అంటే దేశద్రోహం కాదు. నిరసన అంటే అశాంతి కాదు. సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతి పోస్టు తప్పుడు సమాచారం కాదు. "ప్రజలు ఏం చూడాలో నిర్ణయించే అధికారం ఎవరిది?" అనే ప్రశ్న వరకు వెళ్లాలి. ప్రజాస్వామ్యంలో ఆ అధికారం ఒక్క ప్రభుత్వానిదీ కాదు. ఒక్క సోషల్ మీడియా సంస్థదీ కాదు. చివరికి ప్రజలకే సమాచారం కావాలి. నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ కూడా వారిదే కావాలి.

# ఆ కర్కశత్వాన్ని ప్రశంసించాలా?

- మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యలపై రాహుల్ ఫైర్
- విద్యార్థులపై పెల్లెట్ గన్స్, మేకుల లాఠీలతో దౌర్జన్యం
- గాయపడిన చిన్నారులను పరామర్శించానన్న కాంగ్రెస్ ఎంపీ
- తప్పులు అంగీకరించని వారితోనే దేశానికి ముప్పు అని వ్యాఖ్య



**న్యూఢిల్లీ ఆగస్టు 18(ఆంధ్ర మనం):** జంతర్‌మంతర్ నిరసనల సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరును కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రశంసించడాన్ని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. పిల్లలకు కేంద్ర ప్రభుత్వం అబద్ధాలు చెప్పకూడదని హితవు పలికారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఢిల్లీ పోలీసులను ప్రశంసించాలని మోదీ ప్రభుత్వంలోని మంత్రులు అంటున్నారని, కానీ పార్లమెంటుకు అర కిలోమీటరు దూరంలో విద్యార్థులపై పెల్లెట్ గన్స్‌ను ప్రయోగించారని రాహుల్ విమర్శించారు. మేకులు గుచ్చిన లాఠీలను సైతం వినియోగించారని ఆరోపించారు. పోలీసుల దాడిలో ఒక పిల్లాడి కన్ను పోయిందని, మరో యువతి చెవి తెగి పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇలాంటి కర్కశత్వాన్ని ప్రశంసించాలా?" అని ఆయన ప్రశ్నించారు. గాయపడ్డ పిల్లల్ని తాను వ్యక్తిగతంగా కలిశానని, నిరసనల నాటి వేల కొద్దీ వీడియోలను దేశం మొత్తం చూసిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం అసత్యాలు, హింసపై ఆధారపడుతోందని రాహుల్ ఆరోపించారు. మొదట హింసను ప్రయోగించి, ఆ తర్వాత అలాంటిదేమీ లేదని బుకాయిస్తోందని విమర్శించారు. తమ తప్పులను అంగీకరించలేని వారితోనే దేశానికి భారీ ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. "పిల్లలతో అబద్ధాలు చెప్పొద్దు. వాళ్లకు కళ్లు ఉన్నాయి. అన్నీ గుర్తుంటాయి" అని వ్యాఖ్యానించారు.

### మంత్రి ఏమన్నారంటే..

నిరసనల సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరును కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఇటీవల సమర్థించారు. ఎవరికీ ఎలాంటి భారీ నష్టం జరగకుండా అంతటి జన సమూహాన్ని భద్రతా దళాలు జాగ్రత్తగా నియంత్రించాయని అన్నారు. ఇందుకు ఢిల్లీ పోలీసులతో పాటు పరిపాలన యంత్రాంగాన్ని ప్రశంసించాలని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో నిరసనల సందర్భంగా పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుందని ఆయన విమర్శించిన విషయం తెలిసిందే.

# విద్యార్థులపై దాడి.. విచారణకు సుప్రీం కమిటీ!

- 'చలో పార్లమెంట్' ఘటనపై త్రిసభ్య ధర్మాసనం కీలక నిర్ణయం
- మాజీ న్యాయమూర్తులు, విశ్రాంత డీజీపీతో ఉన్నతస్థాయి ప్యానెల్
- వీడియోలు, సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించనున్న బృందం
- నేర చరిత్ర లేని విద్యార్థులపై ఎఫ్ఐఆర్ రద్దుకు యోచన



**న్యూఢిల్లీ ఆగస్టు 18(ఆంధ్ర మనం):** 'చలో పార్లమెంట్' సందర్భంగా విద్యార్థులపై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనుంది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం మంగళవారం ఈ మేరకు కీలక ప్రకటన చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి (సీజే), విశ్రాంత డీజీపీతో ఈ కమిటీ ఏర్పాటు కానున్నట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన అధికారిక ఆదేశాలు బుధవారం వెలువడతాయని ధర్మాసనం ప్రకటించింది.

### ఫుటేజీల పరిశీలన.. బాధితుల విచారణ..

పార్లమెంట్ మార్చ్ సందర్భంగా చోటు చేసుకున్న హింసకు సంబంధించిన వీడియో ఫుటేజీలు, సీసీటీవీ రికార్డింగ్స్‌ను కమిటీకి అందజేయాలని ఆదేశాలు ఇస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. ఢిల్లీతో పాటు ఇతర ప్రాంతాల్లో మహిళా నిరసనకారులే లక్ష్యంగా దాడులు జరిగాయంటూ వస్తున్న ఆరోపణలు, నమోదైన ఫిర్యాదులను కూడా ఈ ఉన్నతస్థాయి కమిటీ పరిశీలిస్తుందని ధర్మాసనం తెలిపింది. బాధితులందరి వాదనలను విన్న అనంతరం, కమిటీ ఇచ్చే సిఫార్సుల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

### విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం..

మరోవైపు విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల వివరాలను అందజేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్తాను ధర్మాసనం ఆదేశించింది. ఎలాంటి నేర చరిత్ర లేని విద్యార్థులపై నమోదైన కేసులను రద్దు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపింది. ఆర్టికల్ 19 కింద నిరసనలు తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని గుర్తుచేసింది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఎఫ్ఐఆర్‌ల రద్దుపై తుది నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.



# ఉరిశిక్షను రద్దు చేయండి

## ఇతర సులువైన మరణాలను ప్రసాదించండి

## సుప్రీంలో దాఖలైన పిటిషన్ కొట్టివేత

**న్యూఢిల్లీ,ఆగస్టు 18(ఆంధ్ర మనం):** మరణశిక్ష పడిన దోషులను ఉరిశిక్ష నుంచి తప్పించి, సులువుగా మరణించే ప్రక్రియను చేపట్టాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. భారతీయ శిక్షా స్మృతిలో భాగంగా కొన్ని కేసుల్లో ఉరి తీస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉరి వేసి దోషిని చంపే ప్రయత్నాలను ఆపేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. ఉరికి బదులుగా, మరేదైనా నొప్పిలేని విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. కాలం చెల్లిన ఉరి విధానాన్ని బహిష్కరించి, దాని స్థానంలో నొప్పి లేకుండా మరణశిక్షను అమలు చేసే విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ సుప్రీంలో పిటీషన్ దాఖలైంది. అయితే ఆ పిటీషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఇక ఈ కేసులో ఇదే తుది తీర్పు కాదని, భవిష్యత్తులో ఈ అంశాన్ని మళ్లీ ప్రస్తావించవచ్చు అని, ఒకవేళ ప్రత్యామ్నాయ మరణాలపై ఏవైనా శాస్త్రీయ ఆధారాలు ఉంటే, దాని ప్రకారం మరణశిక్షను అమలు చేయవచ్చని కోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది. ప్రస్తుతం రిట్ పిటీషన్‌ను డిస్మిస్ చేస్తున్నామని, కానీ భవిష్యత్తులో రాజ్యాంగం ధర్మాసనం ఈ విధానంపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉంటుందని కోర్టు తెలిపింది. శాస్త్రీయ విధానాల్లో మరణశిక్షను అమలు చేసే అంశంలో కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని స్వేచ్ఛగా తీసుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో ఈ పిల్ దాఖలు చేశారు. సీఆర్పీసీలోని సెక్షన్ 354(5) కింద ఉరి ద్వారా మరణశిక్షను అమలు చేసే వారు. అయితే ఆ సెక్షన్‌ను సవాల్ చేస్తూ కోర్టులో పిటీషన్ వేశారు. మరణశిక్ష అమలులో భాగంగా ఉరికి బదులుగా ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వాలని పిటీషనర్ అభిప్రాయపడ్డారు. అనేక దేశాలు ఉరి తీయడానికి బదులుగా ప్రత్యామ్నాయ రీతిలో మరణశిక్షలను అమలు చేస్తున్నాయన్నారు. మరణశిక్ష అమలు రీతిలపై ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి తెలిపారు. విషపూరిత ఇంజెక్షన్ ద్వారా మరణశిక్ష అమలు చేసే విధానం విజయవంతంగా జరగడంలేదని సీనియర్ న్యాయవాది మీనాక్షి ఆరోరా వాదించారు. ఈ అంశంలో కమిటీని ఏర్పాటు చేయాలని ఆ న్యాయవాది కోరారు.

# నేను కూడా దిమాగీ నక్సలైట్‌నే

## ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కేజ్రీవాల్ కామెంట్



**న్యూఢిల్లీ,ఆగస్టు 18(ఆంధ్ర మనం):** ప్రశ్నించే వారంతా దిమాగీ నక్సల్స్ అంటూ తాజాగా ఆప్ కనవ్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఇప్పటికే చిదంబరం తదితరులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా అరవింద్ కేజ్రీవాల్ కూడా మోడీ వ్యాఖ్యలకు ఘాటుగానే స్పందించారు. స్వాతంత్య్ర దినోవ్సవ వేడుకల సందర్భంగా దిమాగీ నక్సల్స్ అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగుతూనే ఉంది. మోదీ వ్యాఖ్యలపై స్పందించిన ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్.. తను దిమాగీ నక్సల్ అయినందుకు గర్వపడుతున్నానని చెప్పారు. తను నిజమైన దేశభక్తుడినని.. బీజేపీకి భయపడేవాడిని కాదని అన్నారు. 80వ స్వాతంత్య్ర వేడుకల్లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. దేశంలో ఆయుధాలు పట్టి అడవుల్లో ఉండే నక్సల్స్ ను అంతం చేశామని.. దిమాగీ నక్సల్స్ హింసను ప్రేరేపించేందుకు ఎదురు చూస్తున్నారని.. సమాజాన్ని తప్పుడు దోవ పట్టించేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ల్గ÷ర్యంగా ప్రశ్నించే వారు దిమాగీ నక్సల్స్.. ఎవరైతే బీజేపీకి భయపడకుండా ప్రశ్నిస్తారో వాళ్లంతా మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్స్. ఒకవేళ భగత్ సింగ్ , అంబేద్కర్ ఇప్పటికీ బతికే ఉంటే.. వాళ్లను కూడా ప్రధాని మోదీ.. దిమాగీ నక్సల్స్ అనేవారేమోనని మండిపడ్డారు. జవాబుదారీ వ్యవస్థ, అవినీతి లేని సమాజం, ప్రజలకు సౌకర్యాలు, హాస్పిటల్స్ స్కూల్స్, , డ్రైనేజీ సిస్టమ్ మొదలైన వాటిపై ప్రశ్నించే వారు మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్సేనా అని ప్రశ్నించారు. నేను నిజమైన దేశ భక్తుడిని అందుకే నేను దిమాగీ నక్సల్.. అంటూ చెప్పుకొచ్చారు.

# 29న రైతు పంచాయితీకి సిద్ధం అవుతున్న పంజాబ్ రైతులు

**న్యూఢిల్లీ,ఆగస్టు 18(ఆంధ్ర మనం):** ప్రతిపాదిత భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా పంజాబ్ రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా జగ్జీత్ దల్లేవాల్ నేతృత్వంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 29న దేశ రాజధానిలో 'రైతు పంచాయతీ' జరుగనున్నది. కాగా ఆదివారం ఢిల్లీ మార్చ్‌కు బయలుదేరిన వందలాది మంది రైతులను పంజాబ్ వైపున గల ఖనౌరీ సరిహద్దు వద్ద జింద్ పోలీసులు అడ్డుకున్నారు. బారికేడింగ్‌తో ఆ మార్గాన్ని సీల్ చేశారు. జగ్జీత్ దల్లేవాల్ హర్యానా- పంజాబ్ సరిహద్దులోని దాతాసింగ్ వాలా గ్రామం నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వరకు 'కిసాన్ బచావో పాదయాత్ర నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇది ఆగస్టు 29న రాజధానిలో 'రైతు పంచాయతీ'తో ముగుస్తుందని తెలియజేశారు. క్రిసాన్ మోర్చా ప్రతినిధులకు హర్యానా అధికారులకు మధ్య జరిగిన మూడు రౌండ్ల చర్చలు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

# వైద్య పనుల్లో నాణ్యత తప్పనిసరి



- **డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజగోపాల్ రావు**

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చేపడుతున్న ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి పనులను నిర్ణీత నిబంధనలు, సాంకేతిక, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. రాజగోపాల్ రావు అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. బుధవారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి గన్నేరువరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ సందర్శించారు. పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి, వివిధ గదులు, ఇతర సదుపాయాలను తనిఖీ చేశారు. నిర్మాణ పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. భవిష్యత్‌లో ప్రజలకు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

**అల్గునూరు సబ్-సెంటర్‌లో తనిఖీ**



అనంతరం పీహెచ్‌సీ థిమ్మాపూర్ పరిధిలోని అల్గునూరు సబ్–సెంటర్‌ను డీఎంహెచ్ఓ సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలను పరిశీలించారు. మందుల స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి అవసరమైన మందులు తగిన పరిమాణంలో అందుబాటులో ఉన్నాయా లేదా సమీక్షించారు. మందుల నిల్వలను సక్రమంగా నిర్వహించాలని, గడువు తేదీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ప్రజలకు అవసరమైన మందులు కొరత లేకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సబ్–సెంటర్ పరిశుభ్రత, ప్రాథమిక వైద్య సేవలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాల అమలుపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు.



# పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకం

- **జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సర్వాయి పాపన్న 376వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. కార్మికులకు ఎక్స్‌గ్రేషియా, కాటమయ్య సేఫ్టీ కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. సంఘాల నాయకులు తమ సమస్యలను దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఐక్యంగా పనిచేస్తూ నియోజకవర్గాల వారీగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎక్సైజ్ శాఖ సమన్వయంతో జిల్లాలోని 3,412 మంది కల్లుగీత కార్మికులకు కాటమయ్య సేఫ్టీ కిట్లు అందించినట్లు కలెక్టర్ వివరించారు. నియోజకవర్గాల వారీగా కరీంనగర్‌లో 463, మానకొండూర్‌లో 933, చొప్పదండిలో 975, హుజురాబాద్‌లో 1,041 మందికి కిట్లు అందించినట్లు తెలిపారు. విద్య, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని సూచించారు. బాలికల చదువుకు ప్రాధాన్యం ఇచ్చి వారు ఉన్నత స్థానాల్లో నిలిచేలా కృషి చేయాలని సంఘం నాయకులకు సూచించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ జనగామ జిల్లాలో సర్వాయి పాపన్న నిర్మించిన కోట ఇప్పటికీ అద్భుతంగా ఉందన్నారు. ఆయన ఆశయాలు, జీవన విధానం, దూరదృష్టిని నేటి తరానికి తెలియజేయాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సర్వాయి పాపన్న వంటి వీరులు అన్ని వర్గాలకు స్ఫూర్తిగా, ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో స్వామి, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, వివిధ శాఖల అధికారులు, తెలంగాణ గౌడ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర గౌడ సంఘం నాయకులు పడాల స్వామి, పులి ఆంజనేయులు గౌడ్, పడాల అజయ్ గౌడ్, దూలం అంజన్న గౌడ్, తాళ్లపల్లి ఎల్లగౌడ్, మాచర్ల ఆంజనేయులు గౌడ్, బుర్ర ముత్తయ్య గౌడ్, సాగర్ గౌడ్, నరసయ్య గౌడ్, రాజు గౌడ్, రమేష్ గౌడ్, మహిళా నాయకురాలు సుజాత గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# చట్టాలతో బాలల భద్రతకు భరోసా




**శెనార్తి మీడియా, రామడుగు :**

చట్టాలతో బాలల భద్రతకు భరోసా చేకూరుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు ఎ.కిరణ్ కుమార్, పెరుక రంగయ్య, సీహెచ్. చంద్రప్రకాశ్ రెడ్డి అన్నారు. జిల్లా ప్రధాన న్యాయ మూర్తి యస్. శివకుమార్, సీనియర్ సివిల్ న్యాయమూర్తి కే. రాణి గారి ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రామడుగు మండలం వెలిచాల గవర్నమెం ట్, సరస్వతి హైస్కూల్లో బుధవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టాలపై అవగాహన ద్వారా పిల్లలు తమ హక్కులను తెలుసుకుని అన్యాయం, వేధింపులు, దోపిడీ వంటి ఘటనల నుంచి తమను తాము రక్షించుకుంటారని, చట్టాలతోనే బాలల భద్రతకు భరోసా కలుగుతుందన్నారు. బాలల హక్కులు, బాల్య వివాహాల నిషేధ చట్టం, పోక్సో యాక్ట్–2012, యాసి డ్ దాడుల బాధితులకు చట్టపరమైన రక్షణ, నల్సా ఆధ్వర్యంలోని ఎల్ఎస్యూసీ ద్వారా పిల్లలకు అందుతున్న ఉచిత న్యాయసేవలను వివరించారు. బాలల హక్కుల పరిరక్షణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అర్హులైన పిల్లలు, మహిళలు, నిరుపేదలు, ఇతర బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సలహాలు, న్యాయ సహాయం, మధ్యవర్తిత్వ సేవలు, పర్మినెంట్ లోక్ అదాలత్ ద్వారా వివాద పరిష్కార సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పిల్లలపై హింస, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు లేదా ఇతర హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన సమాచారం తెలిస్తే సంబంధిత అధికారులకు తెలియజేయాలని, అవసరమైతే 1098 చైల్డ్ హెల్ప్ లైన్, 15100 ఉచిత న్యాయ సేవల హెల్ప్ లైన్ ను సంప్రదించాలని సూచించారు. బాలల భద్రత, హక్కుల పరిరక్షణ కోసం విధిగా బాలల రక్షణ విధానానికి అనుగుణంగా ప్రతి పాఠశా లలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేసుకుని నిత్యం పర్యవేక్షించుకో వాల న్నా రు. కార్యక్రమంలో సరస్వతి హైస్కూల్ కర స్పాం డెంట్ ఉప్పుల శ్రీనివాస్, కో కరస్పాం డెంట్ ఉప్పుల సత్యం, స్కూ ల్ హెచ్ఎం రాజ రాజేశ్వరీదేవి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి పద్మలతాదేవి, టీచర్స్ పాల్గొన్నారు.

# జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులను ఐక్యం చేసి సమ్మెకు దిగుతామని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్ హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం శంకరపట్నం ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు రిలే దీక్ష చేపట్టారు. దీక్షను కొప్పుల శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. 51 జీవోను సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. రెండో పీఆర్సీ పరిధిలోకి గ్రామపంచాయతీ కార్మికులను తీసుకురావాలని, ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కాని కార్మికుల పేర్లను నమోదు చేసి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. హామీల అమలులో జాప్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా కార్మికులను సమీకరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చక్రపాణి, యూనియన్ మండల అధ్యక్షుడు ఎలుకపెల్లి సారయ్య, కార్యదర్శి కొయ్యడ సమ్మయ్య, జనార్ధన్, బండి రమేష్, ఎల్లయ్య, కిష్టయ్య, మధు నక్క, లత తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్ మృతి

- **భూపతిపూర్–కొత్తపేట మార్గంలో ప్రమాదం**

**శెనార్తి మీడియా, జగిత్యాల :**

జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో బుధవారం రాత్రి విషాదం చోటుచేసుకుంది. భూపతిపూర్–కొత్తపేట మార్గమధ్యంలో ట్రాక్టర్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ అదుపుతప్పిన వాహనం టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు, ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జమ్మికుంటలో ఆహార భద్రత తనిఖీలు

**శెనార్తి మీడియా, జమ్మికుంట:**



కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట పట్టణంలో ఆహార భద్రత శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. కొండూరు కాంప్లెక్స్ ప్రాంతంలోని కిరాణా హోల్‌సేల్ దుకాణాలతో పాటు గ్రెయిన్ మార్కెట్ రోడ్‌లోని ఆయిల్ మిల్లులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా ఉన్న పలు ఆహార పదార్థాల నమూనాలను అధికారులు సేకరించారు. జమ్మికుంటలోని రెండు ఆయిల్ మిల్లుల్లో తయారైన వేరుశెనగ నూనె, శనగపప్పు, వేరుశెనగలు, వివిధ రకాల కాన్ఫెక్షనరీ ఉత్పత్తుల నమూనాలను సేకరించారు. సేకరించిన నమూనాలను విశ్లేషణ కోసం గుర్తింపు పొందిన ప్రయోగశాలకు పంపించనున్నారు. ప్రయోగశాల నివేదికలు అందిన అనంతరం ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం–2006, సంబంధిత నిబంధనల ప్రకారం ఆయా ఆహార వ్యాపార సంస్థలపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. ఆహార వ్యాపారులు నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, సురక్షితమైన ఆహార పదార్థాలను మాత్రమే వినియోగదారులకు విక్రయించాలని ఆహార భద్రత శాఖ సూచించింది.

# భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- **పెండింగ్ ఫైళ్లను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలి**
- **అధికారులు సమయపాలన పాటించాలి: కలెక్టర్ సత్యప్రసాద్**

**జగిత్యాల, ఆగస్టు 18:**

భూ భారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కొడిమ్యాల మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ భారతి దరఖాస్తులు, సాదా బైనామా, మీ సేవకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లను పరిశీలించారు. నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. మీ సేవ సర్టిఫికెట్లను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసి ప్రజలకు అందించాలని ఆదేశించారు. అనంతరం కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు.

అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి, వాటికి సంబంధించిన నివేదికలను నిర్ణీత సమయంలో సమర్పించాలని ఆదేశించారు.

# సఖి కేసులు పెండింగ్ లేకుండా చూడాలి

- **అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**

**శెనార్తి మీడియా, కరీంనగర్:**




సఖి సెంటర్ ద్వారా గృహహింస నిరోధక చట్టం–2005 కింద PCR కోర్టులో దాఖలవుతున్న కేసులు పెండింగ్ లేకుండా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమన్వయంతో బాధి తులకు న్యాయ సహాయం అందించడంలో సఖి కేంద్రం ముందుండాలని అన్నారు. బుధవారం సప్తగిరి కాలనీ లోని కరీంనగర్ సఖి కేంద్రంలో 13వ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యలను సఖి సెంటర్ నిర్వాహకురాలు దామెర లక్ష్మి ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ అడ్వకేట్ల ద్వారా PCR కోర్టులో దాఖలవుతున్న గృహహింస కేసుల్లో రక్షణాధికారి నిర్వహించే ఎంక్వయిరీ, డిఐఆర్ ప్రక్రియను ఐసీడీఎస్, సీడీపీఓల సమన్వయంతో పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని సూచించారు. సఖి కేంద్రానికి వచ్చే బాధిత మహిళలు, బాలికలకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు అనుబంధ శాఖలతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించాలన్నారు. జీవో ఎంఎస్ నంబర్ 28 ప్రకారం అందించే విక్టిమ్ కాంపెన్సేషన్ కేసులను కూడా పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కరీంనగర్ జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో వరకట్న వేధింపుల కింద నమోదైన కేసుల స్టేటస్ వివరాలను సమర్పించాలని ఆదేశించారు. సఖి కేంద్రంలో కౌన్సెలింగ్ అనంతరం న్యాయ సలహాల ద్వారా బాధిత మహిళలు తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను కూడా సమర్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా విద్యాధికారి చైతన్య జైనీ, మెప్మా పీడీ స్వరూప రాణి, డీఆర్‌డీఏ డీపీఎం, సీపీ కార్యాలయ మహిళా ఎస్ఐ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఏఓ, డీఎంహెచ్ఓ కార్యాలయ వైద్యాధికారి, డీఎల్ఎస్ఏ అడ్వకేట్ మహేష్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, సీడీపీఓలు, స్పందన ఎన్జీవో సీఈఓ శోభారాణి, ప్రకృతి ఎన్జీవో, సఖి సపోర్ట్ ఏజెన్సీ, పద్మపాణి సొసైటీ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్సీ ప్రతినిధులు, డబ్ల్యూసీడీ విభాగం, సఖి/ఓఎస్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్దార్ పాపన్న జయంతి వేడుకలు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

బహుజన, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలని కేశవపట్నం గౌడ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా బహుజనులు, బలహీన వర్గాల కోసం పాపన్న గౌడ్ పోరాడారని కొనియాడారు. మొగల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి సామాన్య ప్రజల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసం నింపిన మహా యోధుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు గుర్రం శ్రీనివాస్ గౌడ్, బొంగని తిరుపతి గౌడ్, గట్టు తిరుపతి గౌడ్, పంజాల సంపత్ గౌడ్, గొడిశాల సదానందం గౌడ్, గుర్రం శ్రీకాంత్ గౌడ్, దొమ్మటి రవి గౌడ్, తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, కుల పెద్దలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



బయట దొరికే ఆహారం ఎంత తిన్నా.. ఇంట్లో తిన్న ఆహారం ఆరోగ్యంగా ఉంటుంది. అందుకే ప్రతిరోజూ ఇడ్లీ, బోండా అంటూ బయట టిఫిన్ సెంటర్లకు పరిగెత్తకుండా ఇంట్లోనే ఈ వెజిటేబుల్ గంజిని తయారుచేసుకొని తాగండి. రోజంతా చురుగ్గా ఉండడంతో పాటు ఏ పనినైనా వెంటనే క్షణాల్లోనే చేసేస్తారు. ఇంతటి శక్తి ఉన్న ఈ వెజిటేబుల్ గంజిని ఇంట్లోనే సులభంగా చేసుకోవచ్చు. ఖర్చు కూడా చాలా తక్కువలోనే అయిపోతుంది. అయితే ఈ వెజిటేబుల్ గంజి తయారీకి కావాల్సిన పదార్థాలు ఏంటి? ఏ విధంగా ఈ గంజిని తయారుచేసుకోవాలి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

# పొద్దున్నే ఈ గంజి తాగండి..! రోజంతా యాక్టివ్ గా ఉంటారు

### ఈ గంజి తయారీకి కావాల్సిన పదార్థాలు తెలుసుకుందాం

ఒక కప్పు బియ్యం
మూడు కప్పుల నీరు
రుచికి సరిపడా ఉప్పు
ఒక టేబుల్ స్పూన్ నూనె
అర టేబుల్ స్పూన్ ఆవాలు
సన్నగా తరిగిన ఒక క్యారెట్
పది బీన్స్
సన్నగా తరిగిన ఒక మొక్కజొన్న కంకి
మూడు తరిగిన పచ్చిమిర్చి
అల్లం వెల్లుల్లి పేస్ట్ ఒక టేబుల్ స్పూన్
ఒకటిన్నర కప్పుల నీళ్లు
కొద్దిగా కొత్తిమీర

### తయారీ విధానం

ముందుగా మనం తీసుకున్న బియ్యాన్ని రెండుసార్లు నీటితో కడుక్కోవాలి. ఇప్పుడు ఆ బియ్యాన్ని తీసుకొని మిక్సీలో వేసి కాస్త మెత్తగా రుబ్బుకోవాలి. తరువాత కుక్కర్‌లో మెత్తగా రుబ్బుకున్న బియ్యం వేసుకోవాలి. అలాగే అందులో రుచికి ఉప్పు వేసుకోవాలి. దీనితో పాటు మూడు కప్పుల నీళ్లు కూడా కుక్కర్ మూత పెట్టి రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడకనివ్వాలి. తర్వాత ఒక కడాయి తీసుకొని అందులో నూనె పోసి వేడి చేసుకోవాలి. నూనె వేడయ్యాక అందులో ఆవాలు వేసుకొని కొంచెం ఫ్రై చేసుకోవాలి. తరువాత అందులో సన్నగా తరిగిన క్యారెట్, బీన్స్, మొక్కజొన్న ముక్కలు వేసుకొని రెండు నిమిషాల పాటు వేయించుకోవాలి. ఆ తరువాత పచ్చిమిర్చి వేసుకోవాలి, అలాగే అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసుకొని పచ్చి వాసన పోయేవరకు వేయించుకోవాలి. తరువాత అందులో ఒకటిన్నర కప్పుల నీళ్లు పోసుకోవాలి. దీంతోపాటు రుచికి సరిపడా ఉప్పు వేసి అయిదు నిమిషాల పాటు బాగా మరిగించుకోవాలి. నీళ్లు అయిదు నిమిషాల పాటు బాగా మరిగిన తరువాత ముందుగా మనం సిద్ధం చేసి పెట్టుకున్న గంజిలో ఈ వెజిటేబుల్ సూప్ వేసుకోవాలి. తరువాత ఒక్కసారిగా బాగా కలిపి కుక్కర్ మూత వేసి మరలా ఒక అయిదు నిమిషాల పాటు మరిగించుకోవాలి. తరువాత కుక్కర్ మూత తీసేసి కొత్తిమీర చల్లుకుంటే.. ఆరోగ్యానికి ఎంతో మంచిదైనా వెజిటేబుల్ గంజి సిద్ధమైపోతుంది. దీనిని తాగితే రోజంతా చురుగ్గా ఉంటారు.







# జీరో ఆయిల్ పూరీ ఇలా చేసుకోండి

పూరీలు చాలా మందికి ఫేవరెట్ బ్రేక్ ఫాస్ట్. తినాలని ఎంతో ఇష్టం ఉంటుంది. కానీ తింటే మాత్రం ఎంతో కష్టం. త్వరగా జీర్ణం కావు.. అసిడిటీ లాంటి సమస్యలు వస్తాయి. ఎందుకంటే పూరీలను నూనెలో వేయించడమే ఇందుకు కారణం. నూనె వల్ల పూరీల్లో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. అయితే, నూనె ఎక్కువగా ఉందని పూరీలు తినని వారి కోసం కొత్తగా ఓ ట్రెండ్ పాపులర్ అవుతోంది. అదే జీరో ఆయిల్ పూరీ. నో ఆయిల్ పూరీ అని కూడా దీన్ని అంటున్నారు. అంటే చుక్క నూనె లేకుండా పూరీలు చేసుకోవచ్చు. నూనెల లేకుండా పూరీలు చేసుకోవడం సులభమే. నూనె వాడకపోవడంతో కడుపుకు ఇవి లైట్‌గానూ ఉంటాయి. వీటిని తయారు చేసుకునేందుకు ఎయిర్‌ఫ్రయర్ ఉండాలి. మరి ఈ జీరో ఆయిల్ పూరీలను ఎలా తయారు చేసుకోవచ్చో ఇక్కడ చూడండి.

### జీరో ఆయిల్ పూరీకి కావాల్సిన పదార్థాలు

ఓ కప్పు గోధుమ పిండి
రెండు టేబుల్ స్పూన్‌ల పెరుగు
తగినంత ఉప్పు
పిండి కలుపుకునేందుకు నీరు



### జీరో ఆయిల్ పూరీల తయారీ విధానం

ముందుగా ఓ గిన్నెలో గోధుమ పిండి, ఉప్పు వేసి బాగా మిక్స్ చేసుకోవాలి. ఆ తర్వాత దాంట్లో పెరుగు వేసి కలుపుకోవాలి. అనంతరం దాంట్లో కాస్తకాస్త నీరు పోసుకుంటూ పిండిని బాకా కలుపుకోవాలి. పిండిని కాస్త సాగే వరకు ఒత్తుతూ మిక్స్ చేసుకోవాలి. పిండిని బాగా కలుపుకున్నాక.. దానిపై గిన్నె మూసి 15 నుంచి 20 నిమిషాల పాటు పక్కనపెట్టాలి. ఆ తర్వాత పిండిని చిన్న ఉండలుగా చేసుకోవాలి. వాటిని కాస్త మందంగానే పూరీల్లా చపాతీ కర్రతో ఒత్తుకోవాలి. ఆ తర్వాత స్టవ్‌పై ఓ గిన్నెలో నీటిని బాగా వేడిచేసుకోవాలి. మరుగుతున్న నీటిలో పూరీలను ఒక్కొక్కటిగా వేయాలి. నీటిలో సుమారు రెండు నిమిషాలు పూరీని ఉడకనివ్వాలి. నీటిపై తేలగానే బయటికి తీసేయాలి. అలా చేసుకున్న అన్ని పూరీలను ఒకదాని తర్వాత ఒకటి నీటిలో ఉడకబెట్టాలి. నీటిలో ఉడికించిన పూరీలపై తేమను తుడిచేసి పొడిగా చేయాలి. ఆ పూరీలను ఎయిర్ ఫ్రయర్‌లో పెట్టాలి. సుమారు 180 డిగ్రీల హీట్ సెట్ చేసి ఐదు నిమిషాల పాటు పెట్టుకోవాలి. ఎయిర్ ఫ్రయర్‌లో ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ పూరీలు పెట్టవచ్చు. అయితే, ఒకదానిపై ఒకటి ఉండకుండా జాగ్రత్త పడాలి. 180 డిగ్రీల వద్ద 4 నిమిషాల పాటు ఎయిర్ ఫ్రయర్‌లో పూరీని కాల్చుకోవాలి. ఎట్టిపరిస్థితుల్లో ఎక్కువగా కుక్ కాకుండా చూసుకోవాలి. ఎయిర్ ఫ్రయర్‌లో సుమారు 4 5 నిమిషాలు ఉంచాక పూరీలు పొంగి రెడీ అవుతాయి. బయటికి తీసి కర్రీతో తినేయొచ్చు.

# భోజనం గబగబా చేయొద్దు..!

ప్రస్తుత ఉరుకులు, పరుగుల జీవితంలో క్షణం తీరిక ఉండటం లేదు. తినడానికి, పడుకోవడానికి, ఇంట్లో గడపడానికి కూడా నో టైమ్. దీనికి తోడు ఆఫీసు ఒత్తిళ్లు, టెన్షన్లు, వెరసి జీవితం నాశనం అవుతోంది. అయితే ఇటువంటి పరిస్థితుల్లో భోజనం చేయడానికి కూడా టైమ్ ఉండటం లేదు. దీంతో గబగబా భోంచేస్తున్నారు. ఇలా హడావిడిగా భోజనం చేయడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎన్నో అనారోగ్య సమస్యలకు ఇది కారణమవుతుందని పేర్కొంటున్నారు. అయితే ఈ స్టోరీలో హడావిడిగా భోజనం చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయి? అనేది తెలుసుకుందాం.



### టైప్ 2 డయాబెటిస్

రుచికరమైన గోధుమ పిండి అప్పం..ఈజీగా ఇలా చేసుకోండి" రుచికరమైన గోధుమ పిండి అప్పం..ఈజీగా ఇలా చేసుకోండి" వేగంగా భోజనం చేయడం వల్ల శరీరంలోని రక్తంలో కూడా అదే స్థాయిలో షుగర్ శాతం పెరుగుతుంది. అలాగే టైప్ 2 డయాబెటిస్‌కు కారణమవుతుంది. అందుకే వేగంగా భోజనం చేయాలనుకునే వారు తప్పనిసరిగా తమ అలవాటును మార్చుకోవాలి. దీని వల్ల ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చు.

### వేగంగా బరువు పెరగడం..

రుచికరమైన ఎగ్ 65..ఇంట్లోనే ఈజీగా ఇలా చేసుకోండి"రుచికరమైన ఎగ్ 65..ఇంట్లోనే ఈజీగా ఇలా చేసుకోండి" ఈ మధ్య కాలంలో యువతను అధికంగా ఇబ్బంది పెడుతున్న సమస్య అధికంగా బరువు పెరగడం. మనం అవలంబిస్తున్న జీవన విధానం, తింటున్న ఆహారం కారణంగా సులభంగా ప్రతి ఒక్కరూ ఉండాల్సిన బరువు కంటే ఎక్కువగా బరువు పెరుగుతున్నారు. ఇది భవిష్యత్తులో తీవ్రమైన సమస్యగా మారి గుండెపోటు వంటి సమస్యలకు కూడా దారి తీస్తుంది. అయితే హడావిడిగా వేగంగా భోజనం చేయడం వల్ల కూడా అధికంగా బరువు పెరిగే అవకాశం ఉంది. సైన్స్ ప్రకారం మనం ఆహారం తిన్నప్పుడు.. తిన్న 20 నిమిషాల్లో మన కడుపు నిండినట్లు మనకు మెదడు సంకేతం ఇస్తుంది. అయితే వేగంగా తింటే 20 నిమిషాల ముందే కడుపు నిండిందని సంకేతం వస్తుంది. దీని కారణంగా అధికంగా బరువు పెరుగుతారు. ఉభయకాయం వంటి సమస్యల బారిన పడతారు.




### జీర్ణక్రియ ఆటంకాలు..

భోజనం చేసే సమయంలో ఆహారాన్ని నమిలి తినాలి. అప్పుడే అది జీర్ణక్రియలో సరిగ్గా జీర్ణమవుతుంది. అయితే వేగంగా తినడం వల్ల మనం ఆహారాన్ని సరిగ్గా నమలలేము. దీని వల్ల ఆహారం జీర్ణమయ్యే సమయంలో ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాగే జీర్ణ సంబంధిత సమస్యల బారిన పడే అవకాశం ఉంటుంది. దీంతో పాటు ఉభయకాయం పెరగడం, గుండె సమస్యల బారిన పడడం వంటి ప్రమాదాలు

### గ్యాస్, ఉబ్బరం:

ఈ మధ్య కాలంలో వయసుతో సంబంధం లేకుండా చాలా మందిని వేధిస్తున్న సమస్య గ్యాస్, అలాగే ఉబ్బరం. మనం సమయానికి భోజనం చేయకపోయినా ఈ గ్యాస్ సమస్య వెంటాడుతుంది. అలాగే చాలా వేగంగా పెద్ద పెద్ద ముద్దలను తినడం వల్ల కూడా ఈ గ్యాస్ సమస్య ఏర్పడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇలా తినడం వల్ల కడుపులో గాలి, ఆహారం ఒకేసారి వెళ్తాయని, అవి గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలకు దారి తీస్తాయని పేర్కొంటున్నారు. కాబట్టి మీకు హడావిడిగా వేగంగా తినే అలవాటు ఉంటే తక్షణమే దాన్ని మానుకోవాలని సూచిస్తున్నారు.



# భారత్ విజయం లాంఛనమే!!

- భారత్ రెండో ఇన్నింగ్స్‌లో193కి ఆలౌట్
- 372.. శ్రీలంక ముందు భారీ లక్ష్య ఛేదన
- గెలుపుకు ఆరు వికెట్ల ముంగిట భారత్
- శ్రీలంక విజయానికి 288 పరుగులు
- గెలుపుకు చివరి రోజు మిగిలిన ఆట



శ్రీలంకతో తొలి టెస్ట్‌లో టీమిండియా విజయం ముంగిట నిలిచింది. కానీ వరణుడిపైనే భారత్ విజయవకాశాలు ఆధారపడి ఉన్నాయి. బుధవారం ఆఖరి రోజు ఆటలో వరణుడు రెండు సెషన్ల పాటు అంతరాయం కలిగించకపోతే భారత్ విజయం లాంఛనం కానుంది. 372 పరుగుల భారీ లక్ష్య ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 4 వికెట్లకు 84 పరుగులు చేసింది. క్రీజులో ధనంజయ డిసిల్వా(73 బంతుల్లో 3 ఫోర్లతో 31 నాటౌట్), సొనాల్ దినుషా(36 బంతుల్లో 4 ఫోర్లతో 25 నాటౌట్) ఉన్నారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ రెండు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ తలో వికెట్ తీసారు. అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 48.5 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్(69 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 66) హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. దేవదత్ పడిక్కల్(75 బంతుల్లో 6 ఫోర్లతో 44) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/31) నాలుగు వికెట్లు తీయగా.. ప్రబాత్ జయసూర్య(3/43) మూడు



వికెట్లు పడగొట్టాడు. కేశర నువాంత ఒక వికెట్ తీయగా.. లాహిరు కుమార్ 2 వికెట్లు పడగొట్టాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగల భారీ ఆధిక్యం సాధించడంతో శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యం నమోదైంది. నాలుగో రోజు ఆటలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. యశస్వి జైస్వాల్.. మూడో బంతికే డకౌట్ కాగా.. కేఎల్ రాహుల్(35), దేవదత్ పడిక్కల్(44) వేగంగా పరుగులు చేశారు. ఈ క్రమంలో రాహుల్‌ను ప్రభాత్ జయసూర్య ఔట్ చేయగా.. పడిక్కల్(44)ను కేశర నువంత పెవిలియన్ చేర్చాడు. దాంతో భారత్ 116/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే ధ్రువ్ జురెల్ ఔటైనా.. రవీంద్ర జడేజాతో(9) రిషభ్ పంత్ దూకుడుగా ఆడాడు. ఈ క్రమంలో 53 బంతుల్లో రిషభ్ పంత్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శతకం దిశగా సాగిన పంత్(66)ను లాహిరు కుమార ఔట్ చేశాడు. పంత్ వికెట్ తర్వాత భారత ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. అయితే మూడో సెషన్ ఆటకు ముందు వర్షం అంతరాయం కలిగించింది. ఆఖరి సెషన్‌లో భారత్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. కెప్టెన్ ధనంజయ డిసిల్వా(73 బంతుల్లో 3 ఫోర్లతో 31 నాటౌట్), సొనాల్ దినుషా(36 బంతుల్లో 4 ఫోర్లతో 25 నాటౌట్) మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.

# హాకీ ప్రపంచ కప్.. భారత మహిళల ఘన విజయం!

- దక్షిణాఫ్రికాపై 6-1తో భారత జట్టు జైత్రయాత్ర
- టోర్నీలోనే టీమిండియాకు అతిపెద్ద గెలుపు
- సమష్టిగా రాణించిన ఫార్వర్డ్, డిఫెన్స్ విభాగాలు
- పూల్-డిలో మరింత పటిష్టమైన భారత్ స్థానం



మహిళల హాకీ ప్రపంచ కప్ 2026లో భారత జట్టు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. పూల్-డి రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 6-1 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ టోర్నీలో ఇప్పటివరకు భారత్‌కు ఇదే అతిపెద్ద విజయం కావడం విశేషం. మ్యాచ్ ఆరంభం నుంచే ప్రత్యర్థిపై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన భారత క్రీడాకారిణులు వరుస గోల్స్‌తో విరుచుకుపడ్డారు.

### ఆరంభం నుంచే జోరు..

మ్యాచ్ 11వ నిమిషంలో సునేలిటా టోప్పో గోల్ చేసి భారత్‌కు అదిరిపోయే శుభారంభం అందించింది. సర్కిల్‌లోకి వచ్చిన బంతిని అందుకున్న టోప్పో ఎలాంటి పొరపాటు చేయకుండా నేరుగా గోల్‌పోస్ట్‌లోకి పంపింది. దక్షిణాఫ్రికా రక్షణ విభాగం చేసిన తప్పిదాన్ని సద్వినియోగం చేసుకుంటూ భారత్ తొలి ఆధిక్యాన్ని సాధించింది.

### గోల్స్ వర్షం కురిపించిన భారత్..

రెండో క్వార్టర్‌లోనూ భారత మహిళలు తమ దూకుడు కొనసాగించారు. నవనీత్ కౌర్, సుశీలా చాను చెరో గోల్ సాధించడంతో భారత్ పటిష్ట స్థితికి చేరింది. మూడో క్వార్టర్‌లో భారత జోరు మరింత పెరిగింది. దీపిక, లాల్‌రెమ్సియామి, రాణా సాక్షి వరుసగా ఒక్కో గోల్ నమోదు చేయడంతో భారత్ ఆధిక్యం 6-0కు చేరింది. మ్యాచ్ పూర్తిగా భారత్ చేతుల్లోకి వెళ్లడంతో దక్షిణాఫ్రికా జట్టు తిరిగి పుంజుకునే అవకాశం లేకుండా పోయింది.

### పూల్-డిలో తిరుగులేని స్థానం..

చివరి క్వార్టర్‌లో దక్షిణాఫ్రికా ఒక గోల్ సాధించి భారత ఆధిక్యాన్ని స్వల్పంగా తగ్గించింది. అయితే అప్పటికే మ్యాచ్ పూర్తిగా భారత్ వైపు ఉండటంతో ఆ గోల్ ఎలాంటి ప్రభావం చూపలేదు. చివరకు భారత్ 6-1తో భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో పూల్-డి పోటీలో భారత జట్టు తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. గత మ్యాచ్‌లతో పోలిస్తే ఈ మ్యాచ్‌లో భారత ఫార్వర్డ్ లైన్, డిఫెన్స్ విభాగాలు రెండూ సమష్టిగా రాణించి విజయంలో కీలక పాత్ర పోషించాయి.

# శ్రీలంక ఆటగాడి మెడకు తీవ్ర గాయం..

భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో దురదృష్టకర ఘటన చోటు చేసుకుంది. మంగళవారం నాలుగో రోజు ఆటలో ఫీల్డింగ్ చేస్తూ శ్రీలంక ఫీల్డర్ దినేష్ చండీమల్ తీవ్రంగా గాయపడ్డాడు. బౌండరీ లైన్ వద్ద బంతిని ఆపే క్రమంలో అదుపుతప్పి కిందపడిపోయిన చండీమల్‌కు మెడతో పాటు కుడి భుజానికి బలమైన గాయమైంది. దాంతో అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. నాలుగో రోజు ఆట తొలి సెషన్ ఆరంభంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. కేశర నువాంత వేసిన నాలుగో ఓవర్ ఆఖరి బంతిని కేఎల్ రాహుల్.. స్వీప్ షాట్‌తో డీప్ బ్యాక్‌వార్డ్ స్క్వేర్ లెగ్ దిశగా ఆడగా.. దినేష్ చండీమల్ పరుగెత్తుకుంటూ వచ్చి బంతిని ఆపే ప్రయత్నంలో కిందపడిపోయాడు. ఈ క్రమంలో అతని కుడి భుజం బలంగా నేలకు తాకడంతో మెడకు తీవ్ర గాయమైంది. ఫిజియోలు పరీక్షించి అతన్ని ఆసుపత్రికి తరలించారు. అయితే అతని స్కానింగ్ తీయించామని, అంతర్గత గాయాలు ఏమి లేవని శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. కంకషన్ టెస్ట్‌లో చండిమాల్ విఫలమయ్యాడని, దాంతో అతను ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడని తెలిపింది. అతని స్థానంలో పసిందు సూర్య బండార ఆడుతాడని పేర్కొంది. కంకషన్ సబ్‌స్టిట్యూట్‌కు మ్యాచ్ రిఫరీ ఆమోదం తెలిపారని తమ ప్రకటనలో స్పష్టం చేసింది. దాంతో అనూహ్య పరిస్థితుల్లో సూర్య బండార అంతర్జాతీయ టెస్ట్‌ల్లోకి అరంగేట్రం చేశాడు. అయితే తన రాకను ఘనంగా



చాటుకోలేకపోయాడు. 372 పరుగుల లక్ష్య ఛేదన కోసం శ్రీలంక రెండో ఇన్నింగ్స్ ప్రారంభించగా.. సూర్య బండార(0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. మానవ్ సుతార్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. మానవ్ సుతార్‌తో పాటు సిరాజ్, ప్రసిధ్ కృష్ణ సత్తా చాటడంతో శ్రీలంక 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. క్రీజులో కెప్టెన్ దనంజయ డిసిల్వా(24 బ్యాటింగ్), సోనాల్ దినుషా(8 బ్యాటింగ్) ఉన్నారు. భారత్ విజయానికి ఇంకా 6 వికెట్లు అవసరం కాగా.. శ్రీలంక 300 ప్లస్ రన్స్ చేయాల్సి ఉంది.





# గాయత్రీ , శ్రీకాంత్ లకు అర్జున అవార్డు..

### మొత్తం 17 మందికి ఈ పురస్కారాలు

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మక నేషనల్ స్పోర్ట్స్ అవార్డ్స్ 2025 జాబితాను మంగళవారం అధికారికంగా ప్రకటించింది. తెలుగు తేజం, ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రి, షూటర్ శ్రీకాంత్ లకు ప్రతిష్టాత్మక అర్జున అవార్డు దక్కింది. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అయిన గాయత్రీ, షూటర్ అయిన శ్రీకాంత్.. సాధించిన ఘనతలకు మెచ్చి, కేంద్రం ఈ పురస్కారం ప్రకటించింది. వీరితోతోపాటు మొత్తం 17 మంది అథ్లెట్లకు అర్జున అవార్డులు దక్కగా, ఒకరికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం లభించింది. అయితే ఈ అవార్డుల ప్రకటనలో అందరినీ ఆశ్చర్యపరిచిన అంశం దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డుకు ఒక్కరి పేరు కూడా ఎంపిక కాకపోవడమే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం ఈ అవార్డులను ఖరారు చేసింది. గత నాలుగేళ్ల కాలంలో అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లకు ఖేల్ రత్న పురస్కారాన్ని అందిస్తుంటారు. 2024 లో చెస్ వరల్డ్ ఛాంపియన్ గుకేశ్ దొమ్మరాజు, ఇండియన్ మెన్స్ హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, ఒలింపిక్ మెడలిస్ట్ మను భాకర్ లకు ఖేల్ రత్న లభించింది. కానీ 2025 అవార్డుల సైకిల్‌లో ఏ ఒక్క క్రీడాకారుడి పేరును కమిటీ నామినేట్ చేయకపోవడంతో ఈ అత్యున్నత గౌరవ జాబితా ఖాళీగా మిగిలిపోయింది. గత నాలుగేళ్లలో నిలకడైన ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ ప్రదర్శించిన వారికి అర్జున అవార్డులను ప్రకటించారు. హైజంపర్ తేజస్విన్ శంకర్, స్ప్రింటర్లు మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి, బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ త్రీసా జాలీ, చెస్ గ్రాండ్‌మాస్టర్లు విదిత్ గుజరాతి, దివ్య దేశ్‌ముఖ్, హాకీ స్టార్లు లాల్‌రెమ్‌సియామి, రాజ్‌కుమార్ పాల్, షూటర్ అఖిల్ షెరాన్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును దక్కించుకున్నారు. వీరితో పాటు పారా షూటర్ రుద్రాంశ్ ఖండేల్వాల్, పారా అథ్లెట్ ఏక్తా భ్యాన్, రోయింగ్ ప్లేయర్ అరవింద్ సింగ్, బాక్సర్ నరేందర్, కబడ్డీ ప్లేయర్లు సుర్జీత్, పూజ, డెఫ్ షూటర్ ధనుష్ శ్రీకాంత్.. జాబితాలో నిలిచారు.



# ధ్రువ్ జురెల్ స్టన్నింగ్ క్యాచ్‌పై దుమారం

భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో అంపైర్ల నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదమవుతున్నాయి. ఎల్బీడబ్ల్యూ, క్యాచ్‌ల విషయంలో అంపైర్లపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అంపైర్ల తీరు కారణంగానే తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేసిందని మూడో రోజు ఆట అనంతరం భారత స్పిన్నర్ మానవ్ సుతార్ అనడం తీవ్ర వివాదాస్పదమైంది. నాలుగో రోజు ఆటలో కేఎల్ రాహుల్ ఎల్బీడబ్ల్యూ విషయంలో అంపైర్ ఘోర తప్పిదం చేయడం.. డీఆర్ఎస్ ద్వారా అతను ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకోవడం కూడా చర్చనీయాంశమైంది. ఆఖరి సెషన్‌లో భారత ఫీల్డర్ ధ్రువ్ జురెల్ అందుకున్న లో-క్యాచ్‌పై కూడా దుమారం రేగుతోంది. శ్రీలంక ఓపెనర్ లాహిరు ఉడారా ఇచ్చిన లో- స్లిప్ క్యాచ్‌ను ధ్రువ్ జురెల్ అద్భుతంగా అందుకున్నాడు. అయితే క్యాచ్ అందుకునే క్రమంలో బంతి నేలకు తాకినట్లుగా రిప్లేలో కనిపించింది. కానీ ఫీల్డ్ అంపైర్ ఔటిచ్చాడు. ఈ నిర్ణయంపై శ్రీలంక కోచ్‌లు, ఆటగాళు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీలంక రెండో ఇన్నింగ్స్ సందర్భంగా మానవ్ సుతార్ వేసిన 22వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ నాలుగో బంతిని లాహిరు ఉడారా డిఫెన్స్ చేయగా బంతి గల్లీ వైపు లో-క్యాచ్‌గా వచ్చింది. అక్కడే ఉన్న ధ్రువ్ జురెల్ బంతిని అద్భుతంగా అందుకున్నాడు. రిప్లేలను పరిశీలించిన అంపైర్ బంతి కింద చేతివేళ్లు ఉన్నాయని ఔటిచ్చాడు. అయితే ఈ నిర్ణయంపై లాహిరు ఉడారా అసంతృప్తి వ్యక్తం చేశాడు. అసహనంగా క్రీజును వీడాడు. ప్రస్తుతం ఈ క్యాచ్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.



# రామ్ చరణ్‌తో 'ధురంధర్' బ్యూటీ రొమాన్స్?

**సినిమా డెస్క్:**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఆర్‌సీ 17పై రోజుకో ఆసక్తికర వార్త తెరపైకి వస్తోంది. 'రంగస్థలం' తర్వాత ఈ విజయవంతమైన జోడీ మరోసారి కలిసి పనిచేస్తుండటంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం చిత్ర కథా పనులు పూర్తయినట్లు, త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటివరకు ఈ సినిమాలో కథానాయికగా నయనతార, రష్మిక మందన్న, కియారా అద్వానీ పేర్లు వినిపించాయి. అయితే తాజాగా బాలీవుడ్ యువ నటి సారా అర్జున్ పేరు తెరపైకి వచ్చింది. 'ధురంధర్'తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సారా అర్జున్‌ను రామ్ చరణ్ సరసన కథానాయికగా ఎంపిక చేసే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే దర్శకుడు సుకుమార్ సారాకు కథ వినిపించినట్లు, ఆమె ఎంపిక దాదాపు ఖరారైనట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. చైల్డ్ ఆర్టిస్టుగా కెరీర్ ప్రారంభించిన సారా అర్జున్.. ఇప్పుడు కథానాయికగా వరుస అవకాశాలు అందుకుంటున్నారు. రామ్ చరణ్‌తో ఆమె జోడీ కుదిరితే తెరపై ఈ కొత్త కలయిక ఎలా ఉంటుందనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. సుకుమార్ దర్శకత్వంలో రామ్ చరణ్ మరోసారి కనిపించనున్న నేపథ్యంలో ఆర్‌సీ17పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. సారా అర్జున్ కూడా ఇందులో భాగమైతే సినిమాపై మరింత ఆసక్తి పెరిగే అవకాశం ఉంది. అయితే కథానాయిక విషయంలో అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ వార్తను ప్రచారంగానే చూడాల్సి ఉంటుంది



# ఎన్టీఆర్ ఓన్ ప్రొడక్షన్ హౌస్


మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ సినీ రంగంలో మరో కీలక అడుగు వేశారు. ఇప్పటివరకు హీరోగా వరుస సక్సెస్‌లతో దూసుకెళ్తున్న తారక్.. తాజాగా తన సొంత ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించినట్లు సమాచారం. 'NTRTAIN' పేరుతో ఈ నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసినట్లు జోరుగా వార్తలు ప్రచారం అవుతున్నాయి. NTR + ENTERTAIN = NTRTAIN అని జూనియర్ ఎన్టీఆర్ తన ప్రొడక్షన్ హౌస్‌కు పేరు పెట్టినట్లు చెబుతున్నారు. ఎన్టీఆర్ పేరులోని 'NTR'తో పాటు ఎంటర్‌టైన్‌మెంట్‌ను కలిపి 'NTRTAIN' అనే పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. సినిమా, వినోదం అనే రెండు అంశాలను ప్రతిబింబించేలా ఈ పేరును డిజైన్ చేసినట్లు సమాచారం. తన పేరుతో పాటు సినిమాపై ఉన్న అభిరుచిని కూడా ఈ బ్రాండ్ ద్వారా చాటేలా తారక్ ఈ పేరును ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్మాణ సంస్థకు జూనియర్ ఎన్టీఆర్‌తో పాటు ఆయన సతీమణి ప్రణతి డైరెక్టర్లుగా వ్యవహరించనున్నట్లు సమాచారం. ఇప్పటికే హీరోగా పాన్ ఇండియా స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఎన్టీఆర్.. ఇక నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతున్నారనే చర్చ ఇప్పుడు ఇండస్ట్రీలో మొదలైంది. 'NTRTAIN' ద్వారా ఎలాంటి సినిమాలను నిర్మించబోతున్నారు? కేవలం ఎన్టీఆర్ నటించే చిత్రాలనే నిర్మిస్తారా? లేక కొత్త కథలు, కొత్త దర్శకులు, యువ ప్రతిభను ప్రోత్సహించేలా సినిమాలు తెరకెక్కిస్తారా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. అయితే నిర్మాణ సంస్థకు సంబంధించిన పూర్తి వివరాలు, తొలి ప్రాజెక్ట్ ఎప్పుడు ప్రారంభమవుతుంది? అనే విషయాలపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం ఎన్టీఆర్ వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఒకవైపు స్టార్ హీరోగా సినిమాలు చేస్తూనే.. మరోవైపు నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టడం ఆసక్తికరంగా మారింది.



# రాశీ ఖన్నా టాప్‌పై టవల్ చుట్టి రచ్చ రచ్చ

**సినిమా డెస్క్:**

రాశీ ఖన్నాకు సోషల్ మీడియాలో ప్రత్యేకమైన అభిమానగణం ఉంది. ఆమె ఎప్పటికప్పుడు తన కొత్త ఫొటోలను అభిమానులతో పంచుకుంటూ ఆకట్టుకుంటుంటారు. తాజాగా రాశీ ఖన్నా షేర్ చేసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. ముఖ్యంగా ఆమె ధరించిన ఎరుపు రంగు టాప్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఈ దుస్తుల శైలి కాస్త భిన్నంగా కనిపించడంతో అభిమానుల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. రాశీ ఖన్నా ధరించిన టాప్ టవల్ ను చుట్టుకున్నట్లుగా ఉందా? లేక ఆ దుస్తుల రూపకల్పనే అలా ఉందా? అంటూ కొందరు నెటిజన్లు చర్చించుకుంటున్నారు. సాధారణంగా కనిపించే దుస్తులకు భిన్నంగా ఉండటంతో ఈ లుక్ ప్రత్యేకంగా నిలిచింది. ఎరుపు రంగు దుస్తుల్లో రాశీ ఖన్నా గ్లామర్ లుక్ యువతను ఆకట్టుకునేలా ఉందంటూ అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. తాజా ఫొటోల్లో రాశీ ఖన్నా తన అందంతో పాటు విభిన్నమైన దుస్తుల శైలితోనూ ఆకట్టుకున్నారు. ఆమె ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. రాశీ ఖన్నాకు ఉన్న ప్రత్యేకమైన అభిమానగణం కారణంగా ఆమెకు సంబంధించిన ఏ కొత్త ఫొటో వచ్చినా క్షణాల్లో వైరల్ గా మారుతోంది. తాజా లుక్ కూడా అదే విధంగా అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది.



## బీచ్ లో బికినీ లుక్ లో ఆకాంక్షా సింగ్..

తెలుగు ప్రేక్షకులకు 'మళ్లీ రావా' సినిమాతో పరిచయమైన ఆకాంక్షా సింగ్ ప్రస్తుతం విహారయాత్రలో సందడి చేస్తున్నారు. భర్తతో కలిసి మాల్దీవులకు వెళ్లిన ఆమె.. అక్కడి అందమైన బీచ్ ఒడ్డున బికినీ దుస్తుల్లో కనిపించారు. సముద్ర తీరంలో సరదాగా గడుపుతూ తీసుకున్న ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో అవి వైరల్ గా మారాయి. సుమంత్ సరసన 'మళ్లీ రావా'లో నటించిన ఆకాంక్షా సింగ్ .. తొలి సినిమాతోనే తెలుగు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. ఆ తర్వాత అక్కినేని నాగార్జున కథానాయకుడిగా నటించిన 'దేవ్ దాస్ 'లోనూ కనిపించారు. . ప్రస్తుతం సినిమాలకు కాస్త దూరంగా ఉన్న ఆకాంక్షా సింగ్ .. సామాజిక మాధ్యమాల్లో మాత్రం అభిమానులతో తరచూ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విశేషాలను పంచుకుంటున్నారు. తాజాగా మాల్దీవుల బీచ్ లో ఆమె చేసిన సందడి ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.



# జైలర్-2'పై క్లారిటీ.. ఫస్ట్ సింగిల్ ఎప్పుడంటే?

**సినిమా డెస్క్:**

సూపర్‌స్టార్ రజనీకాంత్, దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'జైలర్-2'. 2023లో విడుదలై ఘన విజయం సాధించిన 'జైలర్'కు కొనసాగింపుగా ఈ సినిమా రూపొందుతోంది. రజనీకాంత్ మరోసారి టైగర్ ముత్తువేల్ పాండియన్ పాత్రలో కనిపించనుండటంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం ముమ్మరం చేస్తోంది. తాజాగా 'జైలర్-2' తొలి పాట విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఆగస్టు 21న తొలి పాటను విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. 'విందు సిద్ధమైంది..' అంటూ రజనీకాంత్ పవర్‌ఫుల్ లుక్‌తో కూడిన పోస్టర్‌ను విడుదల చేసింది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ పాటపై అభిమానుల్లో ఇప్పటికే ఆసక్తి నెలకొంది. ఇదిలా ఉంటే.. 'జైలర్-2' విడుదల తేదీపై ఇటీవల కొన్ని పుకార్లు వినిపించాయి. అక్టోబర్ 15న సినిమా ప్రేక్షకుల ముందుకు రావడం కష్టమేనంటూ ప్రచారం జరిగింది. అయితే తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తున్నట్లు చిత్రబృందం మరోసారి స్పష్టం చేసింది. దీంతో సినిమా వాయిదా పడుతుందన్న వార్తలకు తెరపడినట్లైంది. నెల్సన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. రజనీకాంత్‌తో పాటు మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, ఎస్‌జే సూర్య తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తొలి భాగానికి అనిరుధ్ అందించిన సంగీతం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నేపథ్యంలో.. ఇప్పుడు 'జైలర్-2' తొలి పాటపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# విశ్వనాథ్ & సన్స్'! 4 రోజుల్లో ₹150 కోట్లు



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో వచ్చిన తాజా చిత్రం 'విశ్వనాథ్ & సన్స్' (Vishwanath & Sons) బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీకర స్టూడియోస్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మించిన ఈ ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా రిలీజ్ రోజే పాజిటివ్ టాక్ తెచ్చుకుని అప్రతిహతంగా దూసుకుపోతోంది. ప్రేక్షకుల నుంచి వస్తున్న యునానిమస్ ఆదరణతో ఈ చిత్రం కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా ఏకంగా ₹150 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు రాబట్టి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. సూర్య కెరీర్‌లోనే అత్యంత వేగంగా ఈ మైలురాయిని అందుకున్న చిత్రాల్లో ఒకటిగా 'విశ్వనాథ్ & సన్స్' నిలిచింది. తెలుగు, తమిళ భాషల్లో వీకెండ్‌తో పాటు వర్కింగ్ డేస్‌లో కూడా థియేటర్ల వద్ద హౌస్‌ఫుల్ బోర్డులు దర్శనమిస్తుండటం సినిమా స్టామినాను నిరూపిస్తోంది. తల్లీ-కొడుకుల అనుబంధం, సున్నితమైన భావోద్వేగాలు మరియు వినోదంతో దర్శకుడు వెంకీ అట్లూరి తీర్చిదిద్దిన విధానం కుటుంబ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సంజయ్ విశ్వనాథ్ పాత్రలో సూర్య క్లాసిక్ పెర్ఫార్మెన్స్, జీవీ ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం ఈ సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. ప్రస్తుతం ఉన్న ట్రెండ్‌ను బట్టి చూస్తే, ఈ చిత్రం అతి త్వరలోనే ₹200 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టడం ఖాయంగా కనిపిస్తోంది. సూర్య-వెంకీ అట్లూరి జోడీ అందించిన ఈ 'హార్ట్‌ఫెల్ట్ బ్లాక్‌బస్టర్' సరికొత్త రికార్డులను తిరగరాస్తూ బాక్సాఫీస్ వద్ద తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది.

## ఒకేసారి ఏడు సినిమాలు అనౌన్స్

మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ తన నెక్స్ట్ ప్రాజెక్టుల కు సంబంధించి తాజాగా ఆయ న సోషల్ మీడియా వేదికగా ఆసక్తికరమైన అప్ డేట్ ఇచ్చారు. ఏకంగా ఏడు సినిమాల్లో ఆయన నటించనున్నట్లు వెల్లడిస్తూ.. వాటిని తెరకెక్కించనున్న డైరెక్టర్ల పేర్లను సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. "ఎగ్జైటింగ్ స్టోరీస్, ఎగ్జైటింగ్ జర్నీస్, కొందరు ఎంతో ప్రత్యేకమైన ఫిల్మ్‌మేకర్స్" అంటూ మోహన్‌లాల్ తన ఏడు ప్రాజెక్టులపై ఆసక్తిని పెంచారు. ఆయన లైనప్‌లో విష్ణు మోహన్, అనూప్ సత్యన్, ప్రియదర్శన్, దిలీష్ పోతన్, సత్యన్ అంతిక్కాడ్, జూడ్ ఆంథనీ జోసెఫ్, జీతూ జోసెఫ్ వంటి స్టార్ డైరెక్టర్స్ ఉన్నారు. ఈ లీస్ట్‌లో విష్ణు మోహన్, అనూప్ సత్యన్ వంటి యంగ్ డైరెక్టర్స్‌తో పాటు ప్రియదర్శన్, సత్యన్ అంతిక్కాడ్ వంటి సీనియర్ ఫిల్మ్‌మేకర్స్ ఉండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. మరోవైపు విభిన్న కథలు, సహజమైన కథనాలతో గుర్తింపు తెచ్చుకున్న దిలీష్ పోతన్‌తో మోహన్‌లాల్ కాంబినేషన్ ఎలా ఉంటుందనే ఆసక్తి కూడా ప్రేక్షకుల్లో నెలకొంది. ఇక '2018'తో భారీ సక్సెస్ అందుకున్న జూడ్ ఆంథనీ జోసెఫ్, 'దృశ్యం' సిరీస్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జీతూ జోసెఫ్‌తోనూ సినిమాలు చేయనున్నారు.

Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644